www.bharathasakthi.com

# భారత శక్తి®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 09 | శనివారం,జూన్ 13 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి: హరీశ్ రావు



**కరీంనగర్, :** రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్‌లోని హుజురాబాద్‌లో హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు.సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు.

## తెలంగాణలో పోటీ చేసేందుకు

### పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది: సీఎం రేవంత్



**హైదరాబాద్ (భారత శక్తి) :** తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా? అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎంవిమర్శించారు.

## ముందుంది కష్ట కాలం..


### రాష్ట్రాలను హెచ్చరించిన ప్రధాని నరేంద్ర మోదీ.



**న్యూఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి,జూన్ 12:** భారత్‌లో భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ సవాళ్లపై ప్రధాని మోదీ రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేశారు. నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో మాట్లాడిన ఆయన, ఎల్ నినో పరిస్థితులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దేశ అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్వహించిన నీతి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశంలో వాతావరణ మార్పులు ప్రధాన చర్చాంశంగా నిలిచాయి. ఈ సమావేశంలో పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు. భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పటి నుంచే సమర్థవంతమైన ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) సహా పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు 2026 మధ్యకాలంలో ఎల్ నినో ప్రభావం కనిపించే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే అంచనా వేశాయి. ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆసియా దేశాల్లో వర్షపాతం నమూనాలు మారిపోవడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర జలాల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ పరిస్థితి. దీని ప్రభావం ప్రపంచంలోని అనేక దేశాలపై కనిపిస్తుంది. భారతదేశంలో అయితే ఇది రుతుపవనాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. సాధారణంగా ఎల్ నినో ప్రభావం పెరిగిన సంవత్సరాల్లో వర్షపాతం తగ్గడం, వడగాలులు అధికమవడం, కొన్ని ప్రాంతాల్లో కరవు పరిస్థితులు ఏర్పడటం వంటి సమస్యలు కనిపిస్తాయి. వ్యవసాయ రంగంపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో నీటి కొరత సమస్యలను ఎదుర్కోవాలంటే ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయాలని ప్రధాని రాష్ట్రాలకు సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను విస్తరించడం, భూగర్భ జలాలను పరిరక్షించడం, సాగునీటిని సమర్థంగా వినియోగించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి నిర్వహణకు సంబంధించి కొత్త విధానాలు రూపొందించాలని కూడా సూచించారు.

## జగన్ తప్పుడు ఆరోపణల

### గుట్టు బట్టబయలైంది: నారా లోకేశ్



**అమరావతి (భారత శక్తి)** మాజీ ముఖ్యమంత్రి జగన్ డీఎస్సీ విషయంలో తప్పుడు ప్రచారం చేసి, అభ్యర్థులను తప్పుదోవ పట్టించారని, దీనికి గాను ఆయన ఆంధ్రప్రదేశ్ యువతకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. జగన్ చేసిన ప్రతి ఆరోపణను వాస్తవాలు, డేటాతో సహా తప్పని నిరూపించామని ఆయన అన్నారు. ఈ మేరకు లోకేశ్ ట్వీట్ చేశారు."జగన్ రెడ్డి సృష్టించిన తప్పుడు ప్రచారం ఇప్పుడు పూర్తిగా బట్టబయలైంది. ఆయన చేసిన ప్రతి ఆరోపణను మేం వాస్తవాలు, డేటాతో సహా తప్పని నిరూపించాం. మేము మొదటి నుంచి ఏం చెబుతున్నామో అదే నిజమని ఇప్పుడు రుజువైంది.మా వాదనను న్యాయస్థానాలు కూడా సమర్థించాయి. జగన్ చేసిన నిరాధార ఆరోపణలను కోర్టులు కొట్టివేశాయి. దీంతో ఈ నియామక ప్రక్రియలో మా నిజాయతీ మరోసారి నిరూపితమైంది. లక్షలాది మంది అభ్యర్థులను తప్పుదోవ పట్టించి, వారిలో అనవసర ఆందోళన కలిగించిన ఆయన వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం.ఈ పరిణామాలతో ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు పూర్తి విశ్వాసంతో ముందుకు సాగుతోంది. వేలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థులకు అవకాశాలు కల్పిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం.ఇంత జరిగిన తర్వాత, రాష్ట్ర యువతను తప్పుదోవ పట్టించినందుకు వైఎస్ జగన్ గారు వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇది మా డిమాండ్" అంటూ నారా లోకేశ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## మీనాక్షి రాజ్యసభ నామినేషన్ వివాదంపై

### సిట్ విచారణ జరిపించండి: కేటీఆర్ ఎద్దేవా



**హైదరాబాద్ (భారత శక్తి)** కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశానికీ సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందని, అదే విధంగా ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిత్వానికి సంబంధించిన వివాదంపైనా సిట్ విచారణ జరపాలని వ్యంగ్యం ప్రదర్శించారు.మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోనే కొందరు నాయకులు వ్యవహరించి ఉండవచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది కూడా కాంగ్రెస్ వర్గాలేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు, వర్గపోరాటాలే ఈ పరిస్థితులకు కారణమని పేర్కొన్నారు. పార్టీ ద్రోహులు ఎవరో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించాలని సూచించారు.తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న హైదరాబాద్ నగర సమస్యలను పరిష్కరించకుండా భవిష్యత్ నగరాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తాజాగా కురిసిన వర్షాలతో నగరంలో ఏర్పడిన పరిస్థితులు ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టాయని వ్యాఖ్యానించారు. అలాగే, కేంద్రం తీసుకురానున్న డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గేలా నిర్ణయాలు తీసుకుంటే బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## మీరు విక్రయించే ఆయుధాలతోనే భారత్‌పై దాడులు..

### ఐరోపా దేశాలకు జైశంకర్ స్ట్రాంగ్ కౌంటర్



**ఫిన్లాండ్:** ఇంధన కొనుగోళ్ల కోసం రష్యాను భారత్ ఎంచుకోవడాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ (ా ఝుఱంఞ్ఘుఅఎ్ఝుతీ) సమర్థించారు. రష్యా విషయంలో భారత్ అనుసరిస్తున్న వైఖరిపై ఐరోపా దేశాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. తమను ప్రశ్నిస్తున్న దేశాలే భారత ప్రత్యర్థులకు ఆయుధాలు అమ్ముతున్నాయని, ఆ ఆయుధాలతోనే భారత్‌పై దాడులు జరుగుతున్నాయని అన్నారు. తమను ప్రశ్నిస్తున్న దేశాలు ద్వంద్వ వైఖరి విడనాలని అన్నారు. ఫిన్లాండ్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో ఇంధనం కొనుగోలకు రష్యా విషయంలో భారత్ అనుసరిస్తున్న విధానంపై మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆ దేశ చమురుపై భారత్ ఆధారపడుతోందన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమిచ్చారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగా భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ఉంటాయని అన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం, ఆ తర్వాత మాస్కోపై ఆంక్షలతో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్లకు తీవ్ర అంతరాయం కలిగిందని పేర్కొన్నారు. 'ధర, లభ్యత అనే రెండు పాయింట్ల ఆధారంగా చమురు కొనుగోలు నిర్ణయం తీసుకున్నాం. ఆ సమయంలో మార్కెట్‌లో లభించే చమురులో అధిక భాగం రష్యాకు చెందినదే. పశ్చిమాసియా నుంచి అప్పుడు యూరప్ ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేము నిర్ణయం తీసుకున్నాం' అని జైశంకర్ తెలిపారు. ఆ సమయంలో ప్రపంచ మార్కెట్ల స్థిరీకరణ కోసం రష్యా చమురు కొనుగోలు చేయవచ్చని భారత్‌కు అమెరికా చాలా స్పష్టంగా చెప్పిందని, మొదట్లో రష్యా ఆయిల్ కొన్నందుకు తమపై సుంకాలు వేశారని, ఆ తర్వాత మళ్లీ ఆ ఆంక్షలు ఎత్తేశారని గుర్తుచేశారు. దీనిని ఒక సిద్ధాంతమని కానీ, నైతిక పవిత్రతగా కానీ చూడలేమని అన్నారు.


## మమతా బెనర్జీపై కోల్‌కతాలో ఎఫ్ఐఆర్



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీపై కోల్‌కతాలో ఎఫ్ఐఆర్ నమోదైంది. దక్షిణ కోల్‌కతాలోని నేతాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఓ స్థానికుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు సమాచారం.గత మార్చిలో ధర్మతలలో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో మమత చేసిన వ్యాఖ్యలు మతపరమైన విభేదాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని ఫిర్యాదుదారుడు ఆరోపించారు. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు సమాజంలో భయాందోళనలు, వైషమ్యాలు పెంచేలా ఉన్నాయని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

మే నెలలో ఫిర్యాదు అందగా, తాజాగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు కూడా టీఎంసీకి సవాళ్లను తెచ్చిపెడుతున్నాయి. ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీలో అంతర్గతంగా అసంతృప్తి పెరుగుతోందనే చర్చ సాగుతోంది. కొందరు నాయకులు పార్టీకి దూరమవుతుండగా, మరికొందరు తమ రాజకీయ భవిష్యత్తుపై కొత్త నిర్ణయాలు తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలో నెలకొన్న ఈ పరిణామాలు మమతా బెనర్జీ నాయకత్వానికి పరీక్షగా మారాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు చట్టపరమైన వివాదాలు, మరోవైపు పార్టీ అంతర్గత అసంతృప్తి నేపథ్యంలో టీఎంసీ భవిష్యత్‌పై చర్చ మరింత వేడెక్కుతోంది. ఈ పరిస్థితుల్లో మమతా బెనర్జీ తదుపరి రాజకీయ వ్యూహం ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది.

## భారతీయ సిబ్బంది నౌకపై దాడి..



ఒమన్ తీరంలో భారతీయ నావికులు ఉన్న వాణిజ్య నౌకలపై వరుస దాడులు కొనసాగుతుండటంతో అమెరికా తీరు పట్ల భారత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. గత 48 గంటల్లో రెండోసారి ఢిల్లీలోని అమెరికా సీనియర్ దౌత్యాధికారిని విదేశాంగ శాఖ పిలిపించి అధికారికంగా నిరసన తెలిపింది. నిన్న జరిగిన ఘటనలో 20 మంది భారతీయ సిబ్బంది ఉన్న ఓ వాణిజ్య నౌక దాడికి గురికావడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. అమెరికా అధికారి జేసన్ మీక్స్‌ను పిలిపించి భారత విదేశాంగ శాఖ తమ ఆందోళనలను నేరుగా తెలియజేసింది. గత దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందడంతో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. ఒమన్ తీర ప్రాంతంలో నాలుగు రోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న మూడు వాణిజ్య నౌకలను అమెరికా నౌకాదళం లక్ష్యంగా చేసుకుందని భారత ప్రభుత్వం వెల్లడించింది. భారత నావికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. సెట్టిబెల్లో నౌకపై దాడి జరిగిన వెంటనే అమెరికా అధికారులకు గట్టి నిరసన తెలిపినట్లు వెల్లడించారు. ఇలాంటి దాడులు వెంటనే ఆగాలని, సమస్యల పరిష్కారానికి యుద్ధం కంటే చర్చలు, దౌత్య మార్గాలే సరైనవని భారత్ స్పష్టం చేసిందన్నారు. ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నౌకాయానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని భారత్ కోరింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించేందుకు అన్ని పక్షాలు సంభాషణల బాట పట్టాలని ఢిల్లీ పిలుపునిచ్చింది.

# టీజీపీఎస్సీ గరిష్ట వయోపరిమితిని 46 సంవత్సరాలకు పెంచాలి



ఎల్బీనగర్, జూన్ 12 (భారత శక్తి): తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశంకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపిఎస్సీ) ద్వారా విడుదలవుతున్న నియామక నోటిఫికేషన్లలో గరిష్ట వయోపరిమితిని ప్రస్తుతం ఉన్న 44 సంవత్సరాల నుండి 46 సంవత్సరాలకు పెంచాలని తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వివేకానంద గౌడ్ ఇరువురు కలిసి టీజీపిఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశంకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో అమలులో ఉన్న జీవో 42 ప్రకారం 46 సంవత్సరాల వరకు వయోపరిమితి ఉండేదని, అనంతరం జారీ చేసిన జీవో 86 ద్వారా 44 సంవత్సరాలకు పరిమితం చేయడం వల్ల అనేక మంది అర్హులైన అభ్యర్థులు అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అనేక శాఖల్లో చాలా సంవత్సరాల తర్వాత నియామక నోటిఫికేషన్లు విడుదల అవుతున్నాయని, ముఖ్యంగా డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డిఈఓ), డిగ్రీ కళాశాల లెక్చరర్ వంటి పోస్టులకు సుదీర్ఘ విరామం తర్వాత నోటిఫికేషన్లు వెలువడుతున్నాయని పేర్కొన్నారు. క్రమబద్ధమైన వార్షిక నియామక క్యాలెండర్ లేకపోవడం వల్ల పీజీ , పీహెచ్ డి వంటి ఉన్నత విద్యార్హతలు కలిగిన అనేక మంది అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యుత్తమ విద్యార్హతలు, విషయ పరిజ్ఞానం మరియు అనుభవం ఉన్నప్పటికీ ప్రస్తుతం అనేక మంది అభ్యర్థులు తక్కువ వేతనాలతో ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్నారని వారికి కూడా ప్రభుత్వ సేవలో చేరే అవకాశం కల్పించేందుకు గరిష్ట వయోపరిమితిని 46 సంవత్సరాలకు పెంచడం అవసరమని కోరారు. అదేవిధంగా దరఖాస్తు రుసుమును ప్రస్తుతం ఉన్న రూ.1000 నుండి రూ.100కు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ యువతపై భారం తగ్గించి, ఎక్కువ మంది అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు. ప్రభుత్వం మరియు టీజీపిఎస్సీ అధికారులు ఈ అంశాలను సానుకూలంగా పరిశీలించి నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే నిర్ణయాలు తీసుకోవాలని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖరరెడ్డి, ఇంద్ర నాయక్ పాల్గొన్నారు.

### 2047 నాటికి వికసిత్ భారత్‌గా

## మార్చడమే లక్ష్యమన్న అరుణ

**హైదరాబాద్** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుస్థిర నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన గుర్తింపును సొంతం చేసుకుందని బీజేపీ ఎంపీ డీకే అరుణ కొనియాడారు. 2047 నాటికి దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బలమైన వ్యూహంతో ముందుకు సాగుతోందని ఆమె స్పష్టం చేశారు. మహిళా సాధికారత, అన్నదాతల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను అరుణ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2030 నాటికి దేశవ్యాప్తంగా 3 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి, క్రోర్‌పతి దీదీలు'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయని చెప్పారు. అలాగే వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ, రైతులకు ఎకరాకు రూ. 24 వేల వరకు ఎరువుల సబ్సిడీని అందిస్తోందని, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు ప్రజల జీవితాల్లో ఎంతో భరోసానిచ్చాయని వివరించారు. మోదీ తీసుకున్న సాహసోపేతమైన, విప్లవాత్మక నిర్ణయాల వల్లే భారత్ నేడు ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని అరుణ మీడియాతో వ్యాఖ్యానించారు. దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఉగ్రవాదంపై కేంద్రం ఉక్కుపాదం మోపిందని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, జీఎస్టీ అమలుతో పాటు స్వచ్ఛ భారత్ అభియాన్, జన్ ధన్ యోజన వంటి మైలురాయి లాంటి కార్యక్రమాలు దేశ రూపురేఖలను సమూలంగా మార్చేశాయని, దేశ ప్రగతి-ప్రజల సంక్షేమమే రెండు కళ్లుగా సాగుతున్న ఈ పాలన రికార్డు స్థాయి విజయాలను నమోదు చేస్తోందని ఆమె కొనియాడారు.c

## క్రికెట్ ఆడిన మల్లారెడ్డి

**హైదరాబాద్** మేడ్చల్ నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మాజీ మంత్రి మల్లారెడ్డి సరికొత్త అడుగులు వేశారు. స్థానిక విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కొత్త విద్యా సంస్థలను ఆయన ప్రారంభించారు. మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్, మల్లారెడ్డి పాఠశాల బ్రాంచ్‌లను మల్లారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సరదాగా గడిపారు. వారితో క్రికెట్ ఆడి, అక్కడి వాతావరణంలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ మల్లారెడ్డి చేసిన సందడి అందరినీ ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సభలో మల్లారెడ్డి మాట్లాడుతూ... తనను వరుసగా మూడుసార్లు గెలిపించిన మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. వారికి కృతజ్ఞతగా వారి పిల్లలకు అతి తక్కువ ఫీజులతోనే నాణ్యమైన కార్పొరేట్ విద్యా సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక సీఎంఆర్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని పాఠశాలలను ప్రారంభిస్తామని, నాణ్యమైన విద్యను అందరికీ చేరువ చేయడమే తమ ఆశయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్లు శ్రీదేవి, శిరీష, మున్సిపల్ చైర్మన్ జామూ రవి, మాజీ లైబ్రరీ చైర్మన్ భాస్కర్ యాదవ్, జగన్ రెడ్డి, దయానంద్ యాదవ్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్లేట్ బిర్యానీ జోక్...తిరగబడిన టెకీ లైఫ్

**న్యూఢిల్లీ,** సోషల్ మీడియా యుగంలో నోరు జారితే ఎలాంటి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందో చెప్పడానికి గురుగ్రామ్‌కు చెందిన ఒక యువ టెక్కీ ఉదంతమే తాజా ఉదాహరణ. ప్రముఖ స్టాండప్ కమెడియన్ ప్రణీత్ మోరే నిర్వహించిన ఒక లైవ్ 'క్రౌడ్-వర్క్' షోలో, హిమాన్షు జంగ్రా అనే వెబ్ డెవలపర్ సరదా కోసం చేసిన ఒక వ్యాఖ్య అతడి జీవితాన్ని మలుపు తిప్పింది. తాను కేవలం రూ. 370 ఖర్చు పెట్టి తినిపించిన చికెన్ బిర్యానీకి ప్రతిఫలంగా.. డేటింగ్‌కు వచ్చిన మహిళపై లైంగిక హక్కును ఆశించినట్లు చేసిన ఆ వ్యాఖ్య ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు, నెటిజన్ల ఆగ్రహానికి దారితీసింది. 'క్రౌడ్-వర్క్' కామెడీ షోలో కమెడియన్ అడిగిన ప్రశ్నకు హిమాన్షు సమాధానమిస్తూ.. తాను ఇటీవల తనకంటే వయసులో కాస్త పెద్దదైన ఒక మహిళతో డేటింగ్‌కు వెళ్లానని చెప్పాడు. అక్కడ ఇద్దరూ కలిసి రూ. 370 విలువైన ఒక ప్లేట్ చికెన్ బిర్యానీ తిన్నట్లు పేర్కొన్నాడు. అంతటితో ఆగకుండా, "పైసా వసూల్ కర్నా పడేగా" అంటే పెట్టిన డబ్బును ఎలాగైనా రికవర్ చేసుకోవాలి అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించాడు. కేవలం తక్కువ ఖర్చు పెట్టినంత మాత్రాన ఆ మహిళ నుంచి లైంగిక ప్రయోజనాలను ఆశించవచ్చనే అర్థం వచ్చేలా అతడు చేసిన ఈ వ్యాఖ్యను కమెడియన్ కూడా నవ్వి, మరింత యాంప్లిఫై చేశాడు. ఈ షోకి సంబంధించిన క్లిప్ సోషల్ మీడియా వేదికలైన ఎక్స్ , ఇన్‌స్టాగ్రామ్‌లలో అప్‌లోడ్ అవ్వడమే ఆలస్యం.. విపరీతంగా వైరల్ అయింది. నెటిజన్లు దీనిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రూ. 370 బిర్యానీని ఒక మీమ్‌గా మారుస్తూనే, హిమాన్షు మానసిక స్థితిని తీవ్రంగా తప్పుబట్టారు. మహిళలను ఒక వస్తువులా, కేవలం లావాదేవీల కోణంలో చూసే ఇటువంటి ప్రెడేటరీ మనస్తత్వాన్ని హాస్యం పేరిట ఎలా సమర్థిస్తారంటూ మహిళా సంఘాలు, నెటిజన్లు నిలదీశారు. జోక్ ముసుగులో ఉన్నది ముమ్మాటికీ రేపిస్ట్ మైండ్‌సెట్ అంటూ నెట్టింట పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. ఈ వివాదం కాస్తా హిమాన్షు పని చేస్తున్న స్టార్విక్ డిజైన్ అనే గురుగ్రామ్ ఆధారిత కంపెనీ దృష్టికి వెళ్ళింది. ఈ వైరల్ వీడియో వల్ల తమ సంస్థ ప్రతిష్ట, గౌరవానికి తీవ్ర భంగం వాటిల్లిందని యాజమాన్యం భావించింది. సోషల్ మీడియాలో వస్తున్న ఒత్తిడి, నెటిజన్ల ఆందోళనల నేపథ్యంలో స్టార్విక్ డిజైన్ సంస్థ తక్షణమే స్పందించి హిమాన్షును ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. మహిళల పట్ల ఇటువంటి భావజాలం ఉన్న వ్యక్తిని తమ సంస్థలో కొనసాగించలేమని స్పష్టం చేసింది. అయితే, ఈ వ్యవహారంలో ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. హిమాన్షుకు ఆఫీసులో ఎలాంటి బ్యాడ్ రికార్డ్ లేదు. కార్యాలయంలో అతడి ప్రవర్తనపై ఎలాంటి ఫిర్యాదులు లేవని, ఇప్పటివరకు అతడు ప్రొఫెషనల్‌గానే వ్యవహరించాడని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. అయినప్పటికీ, బయట సమాజంలో మహిళల పట్ల అతడికున్న చులకన భావం, కంపెనీ ఇమేజ్‌ను దెబ్బతీయడం వల్లే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని యాజమాన్యం స్పష్టం చేసింది. డిజిటల్ ప్రపంచంలో క్షణకాలపు ఆనందం కోసం వేసే తప్పుడు అడుగులు కెరీర్‌ను ఎలా బూడిద పాలు చేస్తాయో చెప్పడానికి ఈ బిర్యానీ వివాదం ఒక హెచ్చరికగా నిలిచింది.

# సర్ ద్వారా ఓట్ల తొలగింపుతో బీజేపీ లబ్ధి పొందుతోంది: మధుయాష్కి గౌడ్

- క్షేత్రస్థాయిలో బీఎల్ఏలు సమర్థవంతంగా పనిచేయాలి
- ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం





ఎల్బీనగర్, జూన్ 12, భారత శక్తి: ఓటరు సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) ద్వారా బీజేపీ ప్రభుత్వం తమ వ్యతిరేక వర్గాల ఓట్లను తొలగించి ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందుతోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఇదే జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) శిక్షణ కార్యక్రమం శుక్రవారం రాక్ హిల్స్ కాలనీలోని ఎస్.వి.ఎల్ ఎరీనాలో జరిగింది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, బీఎల్ఏల నియోజకవర్గ సమన్వయకర్త వెన్నెల గద్దర్, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. బెంగాల్‌లో జరిగిన ఎస్ఐఆర్‌లో భాగంగా దాదాపు 90 లక్షల ఓట్లను తొలగించి, ఆ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ లబ్ధి పొందిందని విమర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ తక్కువ వ్యవధిలోనే అనూహ్యంగా 1.2 కోట్ల కొత్త ఓట్లను చేర్చి ప్రయోజనం పొందారన్నారు. ఈ అంశాన్ని రాహుల్ గాంధీ లేవనెత్తినప్పటికీ అటు ఎన్నికల సంఘం (ఈసీ) గానీ, ఇటు సుప్రీంకోర్టు గానీ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతను వాడుకుంటూ ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ భర్త, ప్రముఖ ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్ స్వయంగా వంద నియోజకవర్గాల్లో ఓట్ల కౌంటింగ్ లోపాలను బయటపెట్టారని గుర్తు చేశారు. ఈసీఐ (ఎన్నికల సంఘం) కాస్తా ఈడీ, సీబీఐ, ఐటీగా మారిందని.. ప్రతిపక్ష నేతలపై దాడులు, కేసులు పెడుతూ బీజేపీ బెదిరింపులకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో జరగనున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి బీఎల్ఏ అప్రమత్తంగా వ్యవహరించాలని, ఓటర్ల తొలగింపు, చేర్పులపై బూత్ లెవెల్ అధికారులతో (బీఎల్ఓ) సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### - ఓట్ చోరీకి మోదీ ప్రభుత్వం కుట్ర: చల్లా నరసింహారెడ్డి

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ఓట్ల చోరీకి పాల్పడుతోందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా పేద వర్గాల ఓట్లు గల్లంతు కాకుండా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో గట్టి నిఘా ఉంచాలని సూచించారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇప్పుడు జరుగుతున్న ఓటరు సవరణ ప్రక్రియలో పార్టీ బీఎల్ఏలు క్రియాశీలకంగా పనిచేయాలని వెన్నెల గద్దర్ కోరారు.

### - ఎల్బీనగర్‌లో 74 శాతం ఓటర్ మ్యాపింగ్ తేడాలు: మల్ రెడ్డి రాంరెడ్డి

రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియను అంత ఆషామాషీగా తీసుకోవద్దని హెచ్చరించారు. ఇటీవల బీఎల్ఓలు నిర్వహించిన సర్వేలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఏకంగా 74 శాతం మంది ఓటర్ మ్యాపింగ్‌లో తేడాలు ఉన్నట్లు తేలిందని గుర్తు చేశారు. దీనిని బట్టి భారీగా ఓట్లు తారుమారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని, బీఎల్ఏలు అత్యంత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అనంతరం టీపీసీసీ శిక్షకుడు చైతన్య కృష్ణారెడ్డి బీఎల్ఏలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై, వారి బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు దగా: రూ. 30 లక్షల నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు!

- మల్కాజ్‌గిరి ఎస్ఓటీ, త్రిమల్గెరి పోలీసుల ఉమ్మడి ఆపరేషన్
- ముగ్గురు నిందితుల అరెస్ట్.. 2,000 కిలోల విత్తనాలు,12,800 నకిలీ పౌచ్‌లు స్వాధీనం

హైదరాబాద్ జూన్ 11(భారత శక్తి : లాభాల వేటలో పడి అన్నదాతను నిలువునా ముంచేందుకు సిద్ధమైన నకిలీ విత్తనాల ముఠా ఆటను పోలీసులు కట్టడి చేశారు. నకిలీ, సర్టిఫికేషన్ లేని పత్తి విత్తనాలను మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకోవాలని చూస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను మల్కాజ్‌గిరి ఎస్ఓటీ (ఎస్.ఓ.టి) టీమ్-××, త్రిమల్గెరి పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 30 లక్షల విలువైన 2,000 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, 12,800 నకిలీ పౌచ్‌లు, ఒక మారుతి ఈకో వాహనం, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.




### - బ్రాండ్ కాపీ కొట్టి.. బరితెగించి!

గుజరాత్‌కు చెందిన ప్రముఖ "నర్మదా సాగర్ అగ్రి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్" కంపెనీ బ్రాండ్‌ను తలపించేలా నకిలీ పౌచ్‌లను ముద్రించి, మార్కెట్లోకి వదిలేందుకు నిందితులు వ్యూహం రచించారు. దీనిపై సమాచారం అందుకున్న సదరు కంపెనీ ప్రతినిధి సోలంకె యశ్వంత్ రావు త్రిమల్గెరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన "న్యూ రైతు సంపద




సీడ్స్ కంపెనీ" మేనేజింగ్ డైరెక్టర్ యెరువ బాలశౌరి రెడ్డి (శివారెడ్డి) ఈ అక్రమ దందాకు తెరలేపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### - బోయిన్‌పల్లి మార్కెట్ వద్ద నాకా బందీ

ఫిర్యాదు ఆధారంగా రంగంలోకి దిగిన ఎస్ఓటీ, త్రిమల్గెరి పోలీసులు త్రిమల్గెరి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయిన్‌పల్లి వెజిటబుల్ మార్కెట్ యార్డ్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న మారుతి ఈకో వాహనాన్ని (౦+ 07 9378) అడ్డుకుని సోదా చేయగా.. అందులో పెద్ద ఎత్తున నకిలీ పత్తి విత్తనాల పౌచ్‌లు లభ్యమయ్యాయి. వాహనంలో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు.

### - అరెస్ట్ అయిన నిందితుల వివరాలు:

యెరువ బాలశౌరి రెడ్డి అలియాస్ శివారెడ్డి (ఏ1):(32), మేనేజింగ్ డైరెక్టర్, రైతు సంపద సీడ్స్, నివాసం: బండ్లగూడ జాగీర్. (ప్రధాన సూత్రధారి)

2.కపర్తి బెంజిమెన్ (ఏ2): (28), సేల్స్ ఆఫీసర్, నివాసం: మాక్లూర్ మండలం, నిజామాబాద్ జిల్లా.

3.దొంగ శ్రీను (ఏ3): (48), మల్టీ కలర్ ప్రెస్ డిజైనర్, నివాసం: జీడిమెట్ల, హైదరాబాద్.

### - ఆర్థిక కష్టాల నుంచి అక్రమ దందా వైపు..

పోలీసుల విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూశాయి. ప్రధాన నిందితుడు బాలశౌరి రెడ్డి తన వ్యాపారంలో ఎదురైన తీవ్ర ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కడానికి ఈ అడ్డదారిని ఎంచుకున్నాడు. ఇందుకోసం తన ఉద్యోగి బెంజిమెన్, గ్రాఫిక్ డిజైనర్ దొంగ శ్రీనులతో కలిసి కుట్ర పన్నాడు. దొంగ శ్రీను సాయంతో నర్మదా సాగర్ కంపెనీని పోలిన డిజైన్‌ను సిద్ధం చేసి, మేడ్చల్ జిల్లా బహదూర్‌పల్లిలోని "ట్రూప్యాక్ ఫ్లెక్సిబుల్స్"లో నకిలీ పౌచ్‌లను ముద్రించారు. గోదాముపై దాడి:నిందితుడి ఒప్పుకోలుతో బండ్లగూడలోని కార్యాలయంపై పోలీసులు దాడి చేసి, అక్కడ నిల్వ ఉంచిన 2,000 కిలోల అనుమానాస్పద విత్తనాలను సీజ్ చేశారు.

### - ప్రధాన నిందితుడికి పాత నేరచరిత్ర

నకిలీ విత్తనాల సరఫరాలో ప్రధాన నిందితుడు బాలశౌరి రెడ్డికి పాత నేరచరిత్ర ఉంది. ఇతనిపై గతంలోనూ పలు కేసులు నమోదయ్యాయి:

- 2020: షాద్‌నగర్ పిఎస్ (IPC 420, విత్తనాల చట్టం)
- 2020: రాజేంద్రనగర్ పిఎస్ (IPC 420, విత్తనాల నియంత్రణ ఉత్తర్వులు)
- 2026: భూత్పూర్ పిఎస్ (దీచీా 318, ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్)

### - పోలీసుల హెచ్చరిక: కఠిన చర్యలు తప్పవు!



నకిలీ విత్తనాల విక్రయం యావత్ రైతాంగానికి ముప్పుగా మారిందని మల్కాజ్‌గిరి పోలీసులు హెచ్చరించారు. తక్కువ నాణ్యత గల విత్తనాల వల్ల మొలక శాతం దెబ్బతిని, పంట వైఫల్యాలు చెంది రైతులు ఆర్థికంగా రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఠా గుట్టురట్టు చేసిన ఎస్ఓటీ, త్రిమల్గెరి పోలీస్ బృందాలను మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి (ఖూూ) అభినందించారు. ఈ ఆపరేషన్ మల్కాజ్‌గిరి జోన్ డిసిపి చ. శ్రీధర్ (ఖూూ), రోడ్ సేఫ్టీ డిసిపి కె. మనోహర్, ఎస్ఓటీ అడిషనల్ డిసిపి నంద్యాల నరసింహారెడ్డి, ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్, త్రిమల్గెరి ఎస్‌హెచ్ఓ జి. నాగరాజుల పర్యవేక్షణలో విజయవంతంగా ముగిసింది.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## ప్రమాదకరంగా మారుతున్న ఫెర్టిలిటీ రేటు

ఇటీవల ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ భారత్‌పై మరోసారి దృష్టి సారించారు. భారత్‌లో జనన రేటు రీప్లేస్‌మెంట్ లెవల్ కంటే తగ్గిపోయింది. చదువుకున్న, అత్యంత విద్యావంతులైన వర్గాల్లో ఇది చాలా సంవత్సరాలుగా జరుగుతోంది అని హెచ్చరించారు. 2024లో విడుదలైన లేటెస్ట్ సాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) నివేదిక ప్రకారం భారతదేశ టోటల్ ఫర్టిలిటీ రేటు (టీఎఫ్ఆర్) 1.9కి పడిపోయింది. ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే స్పష్టంగా తక్కువ.నాలుగైదు దశాబ్దాల క్రితం జనాభా గణనీయంగా పెరిగింది. “జనాభా బాంబు” అని ప్రపంచం భయపడిన భారత్ ఇప్పుడు జనాభా తగ్గుదల వైపు వేగంగా పయనిస్తోంది. ఇది మన సమాజం, ఆర్థిక వ్యవస్థ, భవిష్యత్ రూపురేఖలను పూర్తిగా మార్చగల ఒక మహత్తరమైన మలుపు.1950?60లలో భారత్ ఫర్టిలిటీ రేటు 5.5 నుంచి 6 వరకు ఉండేది. అధిక మరణాల రేటు, వైద్య సదుపాయాల కొరత, వ్యవసాయ ఆధారిత జీవనం, ఉమ్మడి కుటుంబాలు, కుమారుడు సంతానం కోసం అనవసరమైన గర్భాలు ఇవన్నీ పెద్ద కుటుంబాలకు దోహదపడ్డాయి. పిల్లలు కుటుంబానికి శ్రమ బలం మాత్రమే కాకుండా, వృద్ధాప్యంలో భరోసా అని భావించారు. కానీ 1990ల నుంచి సమాజం వేగంగా మారింది. మహిళల విద్య, ఉద్యోగ అవకాశాలు, నగరీకరణ, పిల్లల పెంపకం ఖర్చులు (చదువు, ఆరోగ్యం, హౌసింగ్) ఇవన్నీ చిన్న కుటుంబాల వైపు మనస్తత్వాన్ని మార్చాయి. “ఒక్కడు/ఒక్కతే చాలు” అన్న భావన సామాన్యమైంది. ఫలితంగా 2024లో టీఎఫ్ఆర్ 1.9కు పడిపోయింది.ఇక్కడే మనకు అసలు సవాలు కనిపిస్తుంది. దక్షిణాది మరియు పశ్చిమ రాష్ట్రాల్లో ఫర్టిలిటీ రేటు ఇప్పటికే చాలా తక్కువగా ఉంది (తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లు 1.4?1.7 మధ్య ఉండగా, ఢిల్లీ వంటి నగరాలు 1.2 వరకు పడిపోయాయి. అయితే బీహార్ (2.9), ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ వంటి ఆరు రాష్ట్రాలు మాత్రమే ఇంకా రీప్లేస్‌మెంట్ లెవల్‌పై ఉన్నాయి. ఈ ప్రాంతీయ అసమానత భవిష్యత్తులో రాజకీయ, ఆర్థిక, సామాజిక ఉద్రిక్తతలకు దారితీయవచ్చు.చైనా తన “ఒక్క పిల్లవాడు” విధానంతో యువ జనాభాను తగ్గించుకుంది. ఇప్పుడు అక్కడ వృద్ధుల సంఖ్య భారీగా పెరిగి, శ్రమ శక్తి తగ్గి, ఆర్థిక వ్యవస్థపై భారం పడుతోంది. జపాన్, దక్షిణ కొరియా, రష్యా వంటి దేశాలు ఇప్పటికే ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. భారత్ కూడా అదే మార్గంలో నడుస్తుందని మస్క్ హెచ్చరిక. మన దేశంలో డెమోగ్రాఫిక్ డివిడెండ్ అన్న ఆశలు ఇక త్వరలో ముగియవచ్చు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం, ఉద్యోగుల కొరత, పెన్షన్, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరగడం, ఒక తరం మరొక తరానికి సహాయం చేసే సామాజిక చక్రం దెబ్బతినడం ఇవన్నీ రాబోయే దశాబ్దాల్లో మన ముందు నిలబడతాయి. అయినా ఇది పూర్తి విపత్తు కాదు. ఈ తగ్గుదలను పూర్తిగా ప్రమాదంగా చూడకూడదు. ఇది మహిళల సాధికారత, విద్య, ఆర్థిక అభివృద్ధి, కుటుంబ నియంత్రణ అవగాహన వంటి సానుకూల మార్పుల ఫలితం. పిల్లల సంఖ్య తగ్గడం వల్ల ప్రతి పిల్లవాడికి మంచి పోషణ, విద్య, ఆరోగ్యం ఇవ్వడం సాధ్యపడుతోంది. గుణాత్మక జనాభా అన్న లక్ష్యం సాధ్యమవుతోంది.భారత్ ఇప్పుడు ఒక చారిత్రక మలుపు వద్ద నిలబడి ఉంది. జనాభా పెరుగుదల సమస్య నుంచి జనాభా తగ్గుదల సవాలు వైపు మారుతోంది. ఇది భయపడాల్సిన విషయం కాదు, కానీ నిర్లక్ష్యం చేయాల్సిన విషయం కూడా కాదు. సమయం ఉంది.ఫెర్టిలిటీ క్లినిక్‌ల సమాచారం ప్రకారం, ఎగ్ ఫ్రీజింగ్‌లో కీలకమైన ‘ఎగ్ రిట్రీవల్ సైకిల్’ ప్రక్రియకు క్లినిక్‌ను బట్టి రూ.1.2 లక్షల నుంచి రూ.3.2 లక్షల వరకు ఖర్చవుతోంది. అనంతరం అండాలను భద్రపరచడానికి ప్రతి ఏడాది రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఖర్చు ఎక్కువైనా భవిష్యత్తులో తల్లితనాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతో మహిళలు ఈ ప్రక్రియను ఎంచుకుంటున్నారు.వైద్యుల సూచనల ప్రకారం, 25 నుంచి 32 ఏళ్ల మధ్యలో ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోవడం ఉత్తమమని చెబుతున్నారు. 35 ఏళ్లు దాటిన తర్వాత అండాల నాణ్యత, సంఖ్య రెండూ తగ్గే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. హార్మోన్ ఇంజెక్షన్ల వల్ల కొందరిలో ఉబ్బరం, భావోద్వేగ మార్పులు, అరుదుగా అండాశయ హైపర్ స్టిమ్యులేషన్ సిండ్రోమ్ వంటి సమస్యలు రావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే శస్త్రచికిత్స సమయంలో రక్తస్రావం, ఇన్ఫెక్షన్ల ముప్పు కూడా ఉంటుందని వెల్లడించారు.అయితే ఆధునిక విట్రిఫికేషన్ సాంకేతికత వల్ల అండాలను ఎక్కువకాలం నాణ్యత తగ్గకుండా భద్రపరచడం సాధ్యమవుతోందని వైద్యులు తెలిపారు. 25-32 ఏళ్ల మధ్య వయసులో నిల్వ చేసిన అండాలతో భవిష్యత్తులో గర్భధారణ విజయశాతం 60 నుంచి 80 శాతం వరకు ఉండొచ్చని పేర్కొన్నారు. మహిళల వయసు, అండాల నాణ్యత, శీతలీకరణ పద్ధతులు వంటి అంశాలపై ఈ విజయశాతం ఆధారపడి ఉంటుందని వివరించారు.క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడే మహిళలు చికిత్స ప్రారంభానికి ముందే తమ అండాలను ఫ్రీజ్ చేయించుకుంటున్నారని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కీమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సల వల్ల సంతానోత్పత్తి సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. మరోవైపు ఉద్యోగాలు చేసే యువతులు పెళ్లికి ముందే ఫెర్టిలిటీ నిపుణులను సంప్రదించి అండాల నిల్వపై అవగాహన పెంచుకుంటుండటం ప్రస్తుతం నగరాల్లో కొత్త ధోరణిగా మారుతో సరైన విధానాలు, సమగ్ర ఆలోచన, సమతుల్య దృక్పథంతో ఈ మార్పును అవకాశంగా మలచుకోగలిగితే మన భవిష్యత్ తరాలు మన్నించే దేశంగా మారవచ్చు. లేకపోతే, చైనా, జపాన్ మాదిరిగా ఆలస్యంగా బాధపడే దేశంగా మిగిలిపోవచ్చు. సమయం మన చేతిలో ఉంది. ఆలోచనలు మార్చుకునే సమయం ఇదే.

# సాయిబాబా గుడి వద్ద నిరుద్యోగుల ధర్నా





ఎల్బీనగర్, జూన్ 12 (భారత శక్తి): దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయం వద్ద పోలీస్ ఉద్యోగాల భర్తీ, వయోపరిమితి సడలింపుల అంశంపై నిరుద్యోగ యువత ఆందోళనకు దిగింది. పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల సంఖ్యను పెంచాలని,వయో పరిమితిపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు, నిరుద్యోగ అభ్యర్థుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయం వద్ద నిరుద్యోగ యువత చేపట్టిన ధర్నా ఉద్రిక్తంగా మారింది. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల సంఖ్యను 5 వేల నుంచి కనీసం 20 వేల వరకు పెంచాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు.పోలీస్ నియామకాలలో వయోపరిమితి అంశంపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సుమారు 45 వేల పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుత ప్రభుత్వం కేవలం 5 వేల పోస్టుల భర్తీ గురించే మాట్లాడుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.అలాగే గతంలో అమల్లో ఉన్న వయోపరిమితి సడలింపులను ఇప్పుడు ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని, పోలీస్ శాఖలో భారీ స్థాయిలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ధర్నా సందర్భంగా పోలీసులు ఆందోళనకారులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు, నిరుద్యోగ అభ్యర్థుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, పరిస్థితి స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది.ప్రభుత్వం వెంటనే స్పందించి పోలీస్ నియామకాలపై స్పష్టత ఇవ్వాలని, ఉద్యోగాల సంఖ్య పెంచడంతో పాటు ఏజ్ లిమిట్ సడలింపులు కొనసాగించాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి..

**పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ లో పెట్టండి..**
**నిర్దేశించిన గడువు లోగా పనులు పూర్తి కావాల్సిందే..**
**పాలకవర్గం సభ్యులు, అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించండి..**
**ఇస్నాపూర్ డంప్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం..**
**ఐదు మున్సిపాలిటీలలో చేపడుతున్న అభివృద్ధి పనుల పై సమీక్ష..**
**పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..**





పటాన్‌చెరు జూన్ 12 భారత శక్తి పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో ఇటీవల శంకుస్థాపన చేసిన 75 కోట్ల రూపాయలు అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని.. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఇస్నాపూర్, ఇంద్రేశం, గడ్డపోతారం, జిన్నారం, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కమిషనర్లు, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో అభివృద్ధి పనుల పైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెలలో ప్రతి మున్సిపాలిటీలో చేపట్టిన 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల పరిధిలో 50 శాతం పనులు ప్రారంభమయ్యాయని.. మిగిలిన పనులు అతి త్వరలో ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. జిన్నారం మున్సిపల్ పరిధిలో టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కావడంలేదని చైర్మన్ జనార్ధన్, కమిషనర్ నాగేందర్ తెలిపారు. టెండర్లు పొంది.. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లు అందరినీ బ్లాక్ లిస్ట్ లో పెట్టడంతో పాటు.. తిరిగి టెండర్లు రీ కాల్ చేయాలని ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు. గడ్డపోతారం పరిధిలో మొత్తం 15 పనులకు శంకుస్థాపన చేయగా.. వచ్చే వారంలో అన్ని పనులు ప్రారంభమవుతాయని కమిషనర్ తాన్య తెలిపారు. అభివృద్ధి పనుల అంశంలో నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని.. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు.ప్రజలకు జవాబుదారిగా పనిచేసినప్పుడే అధికారులు, ప్రజా ప్రతినిధులపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ఇస్నాపూర్ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెడతామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. అతి త్వరలో మున్సిపల్ పరిధిలో 10 ఎకరాలు కేటాయించి.. బయో మైనింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి మున్సిపల్ పరిధిలో పది కోట్ల రూపాయలతో ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సంయుక్తంగా నిధులు అందించనున్నాయని.. ఇందుకు సంబంధించి ఆయా మున్సిపల్ పాలకవర్గాలు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మున్సిపల్ పాలకవర్గం సభ్యులు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటూ వారి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు సుమలత, ప్రమీల, సుష్మ, కుమార్ గౌడ్, జనార్ధన్, వైస్ చైర్మన్లు సంధ్య గోవర్ధన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మహేందర్ గౌడ్, కమిషనర్లు వెంకట కిషన్, అజయ్ రెడ్డి, తాన్య, దశరథ్, నరేందర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి.

**- కల్వకుర్తి, పాలమూరు, దిండి పురోగతిపై కమిషనర్ శివకుమార్ నాయుడు సమీక్ష.**

**- పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశం.**

హైదరాబాద్ (కలెక్టరేట్), జూన్ 12: భారత శక్తి సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, పరిహారం చెల్లింపుల ప్రక్రియలను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ పునరావాసం, పునర్ఉపాధి, భూసేకరణ (=ఒ= ఒ =ూూ) కమిషనర్ కె. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు-రంగారెడ్డి, దిండి ఎత్తిపోతల పథకాల పురోగతిపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. అంతకుముందు కలెక్టరేట్‌కు విచ్చేసిన కమిషనర్‌కు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) అనంత్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) సునీల్ స్వాగతం పలికారు.

**- సమన్వయంతో పనిచేయాలి**

సమీక్షా సమావేశంలో భూసేకరణ, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాస చర్యలు, పెండింగ్ కేసుల పరిష్కారం తదితర అంశాలపై అధికారులతో కమిషనర్ విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కందుకూరు, ఇబ్రహీంపట్నం




రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఈఈలు), ఆమనగల్లు, మాడ్గుల్ తహసీల్దార్లు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులు ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక

**- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

హైదరాబాద్: జూన్ 12 భారతశక్తి తెలంగాణ సమాజంలో, ఆర్థిక వ్యవస్థలో ఆర్యవైశ్యుల పాత్ర అనన్యసామాన్యమైనదని ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నాడు. గ్రామీణ ప్రాంతంలోని కిరాణా దుకాణం నుంచి మహానగరాల్లోని భారీ పరిశ్రమల వరకు తమదైన పాత్ర పోషిస్తూ, సప్లై చైన్ వ్యవస్థకు వారు వెన్నుముకలా నిలుస్తున్నారని తెలిపాడు.హైదరాబాద్ చంపాపేట్‌లో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల అభినందన సత్కారం, సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే బీగాల గణేశ్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణతో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యాడు. రాష్ట్రంలో మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ఆర్యవైశ్యులను ఈ సందర్భంగా సన్మానించారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు.

**- ప్రజాసేవను వరంగా భావించాలి**

ఎన్నికైన ప్రజాప్రతినిధులంతా ప్రజాసేవను గొప్పవరంగా భావించాలని ఎమ్మెల్యే సూచించాడు. వ్యాపార ధర్మం పాటించడంలో, లాభాలను సమాజ శ్రేయస్సుకు వెచ్చించడంలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నాడు. పన్నుల రూపంలో ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూరుస్తూ, రాష్ట్ర సంక్షేమ పథకాల అమలుకు వారు పరోక్షంగా అందిస్తున్న తోడ్పాటును ఈ సందర్భంగా గుర్తు చేశాడు. ఆర్యవైశ్యుల్లోనూ అనేక మంది పేదలు ఉన్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించాడు.



## అజ్మీరా తండాలో ఘనంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ భూమిపూజ.



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 12: కోనరావుపేట మండలం పరిధిలోని అజ్మీరా తండాలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ అజ్మీరా జయరాం నాయక్, ఉప సర్పంచ్ కిషన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మానుక సత్యం కలిసి సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన పంచాయతీ భవన నిర్మాణం వల్ల తండా ప్రజలకు పాలనాపరమైన సేవలు మరింత సులభతరం అవుతాయని, గ్రామ సమగ్ర అభివృద్ధికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తండా అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, అలాగే తండా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జిల్లా వ్యాప్తంగా స్క్రాప్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు.

- స్క్రాప్ దుకాణాల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.
- చోరీకి సంబంధించిన సొత్తు కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు.
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే.



రాజన్న సిరిసిల్ల,జూన్ 12(భారత శక్తి ):జిల్లాలో నేరాల నియంత్రణ, చోరీ సొత్తు కొనుగోలు మరియు విక్రయాలను అరికట్టేడమే లక్ష్యంతో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని స్క్రాప్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.ఈతనిఖీల్లో భాగంగా స్క్రాప్ దుకాణాల యజమానులు కొనుగోలు చేస్తున్న వస్తువులకు సంబంధించిన రికార్డులు, బిల్లులు, కొనుగోలుదారుల వివరాలను పరిశీలించి , అనుమానాస్పదంగా కనిపించే వస్తువులు, చోరీ సొత్తు కొనుగోలు చేయవద్దని, ప్రతి వస్తువుకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు.తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనం, సర్వీస్ వైర్ కట్టలు, గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 10 మోటార్లు, 03 కాపర్ వైర్ బెండలు దొరుకగా, విటికి సంబంధించి సరైన ఆధారాలు,పత్రాలు సమర్పించలేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.అనంతరం సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ గారు తెలిపారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్క్రాప్ దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా కొనుగోలు, విక్రయాల రిజిస్టర్ నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువుల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు కూడా చోరీ సొత్తు కొనుగోలు, విక్రయాలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

## తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా ప్రమాణస్వీకారం

మెమెంటో తో కైలాస్ శ్రీనివాస్ రావ్





కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 12: తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా కైలాస్ శ్రీనివాస్ రావ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మాజీ మంత్రివర్యులు టీజీ వెంకటేష్ చేతులమీదుగా మెమంటో అందుకున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క.

## - భూపట్టాల పంపిణీతో శాశ్వత హక్కులు





మల్లంపల్లి/ ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 12 (భారత శక్తి): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, భూపట్టాల పంపిణీ ద్వారా భావితరాలకు శాశ్వత హక్కులు కల్పించనున్నామని రాష్ట్రపంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ప్రజా పాలన --ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మల్లంపల్లి మండలంలోని గిత్తూర్ తండా, కొడిశాలకుంట, ముద్దునూరు తండా, రామచంద్రపూర్, భూపాల్‌నగర్, శివతండ గ్రామపంచాయతీల పరిధిలోని ప్రజల నుంచి మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రజలకు న్యాయం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రత్యేకంగా రామచంద్రపూర్ గ్రామ పరిధిలో సుమారు 10వేల 6 వందల ఎకరాల భూములకు సంబంధించిన 30 నుంచి 40 సంవత్సరాలుగా కొనసాగుతున్న సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించి, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతులకు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. భూముల సమస్యల పరిష్కారంతో పాటు రైతులకు పూర్తి స్థాయిలో వ్యవసాయ భరోసా కల్పించేందుకు రెండు పంటలకు సమృద్ధిగా సాగునీరు అందించే ప్రత్యేక ప్రణాళికలను ప్రభుత్వం రూపొందిస్తోందని, రైతులు ఆర్థికంగా బలోపేతం కావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఇళ్లులేని నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు మొదటి విడతలో ములుగు నియోజకవర్గానికి 5 వేలకుపైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, రెండో విడతలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందించేలా కార్యాచరణ కొనసాగుతోందన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.సామాజిక భద్రతలో భాగంగా అర్హులైన వారికి త్వరలోనే నూతన పెన్షన్లు మంజూరు చేసి ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, మహిళా సంఘాలకు విశిష్ట గౌరవం కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందించామని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి రంగంలో మరింతగా ఎదగడానికి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న గోదాములు మహిళా సంఘాల వీవో భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. నూతన అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు.ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా ప్రభుత్వమే గ్రామాలకు వెళ్లి సమస్యలను స్వీకరించి అక్కడికక్కడే పరిష్కారం చూపించే విధానాన్ని అమలు చేస్తున్నామని, ప్రతి దరఖాస్తును బాధ్యతగా తీసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రధానంగా పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, భూ సమస్యలు, గ్రామస్థాయి స్థానిక సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని తెలిపారు. ఈ నాలుగు ప్రధాన విభాగాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రామాణిక ఫార్మాట్ రూపొందించామని, ఫిర్యాదుదారులు సంబంధిత అంశంపై వివరాలు నమోదు చేసిన వెంటనే ఎంపీడీఓ, ఎంపీఓ, తహసీల్దార్ స్థాయిలో పరిశీలన చేపడతామని చెప్పారు. జిల్లా స్థాయిలో పరిష్కారం సాధ్యమైతే వెంటనే చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర స్థాయిలో పరిష్కారం అవసరమైతే సంబంధిత శాఖల ప్రధాన కార్యాలయాలకు పంపించి త్వరితగతిన పరిష్కరించే చర్యలు చేపడతామని తెలిపారు.

అంతకుముందు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామ పరిధిలోని యేసునగర్‌లో సీఆర్ఆర్ 2025-26 నిధులతో రూ.19 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి దుర్గామాత ఆలయం వరకు రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, అలాగే డీఎంఎఫ్‌టీ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన దుర్గామాత దేవాలయ కాంపౌండ్ వాల్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్‌తో కలిసి మెగా శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

"అమ్మ మాట -- అంగన్‌వాడి బాట అంగన్‌వాడీలో పిల్లలను నమోదు చేయండి, వారి భవిష్యత్తుకు పునాది వేయండి" అనే నినాదంతో ములుగు ప్రాజెక్టు మల్లంపల్లి సెక్టార్ రామచంద్రపూర్ యేసునగర్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు.

రామచంద్రపూర్ ప్రజా దర్బార్ కార్యక్రమం అనంతరం మంత్రి అనసూయ సీతక్క అంగన్‌వాడీ పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ బొక్క సత్తిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామాల సర్పంచులు, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 12: కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోనీ బిక్కనూరు మండలానికి చెందిన గ్రామాల కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలు సహకరించాలి.

కడప, జూన్ 12(భారత శక్తి ): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లాలో ప్రజలు చురుకుగా సహకరించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. బాల కార్మికులపై సమాచారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1800 233 2447 కు ఫోన్ చేసి ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపారు.గృహ సేవలు, నిర్మాణ రంగం, చిన్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు తదితర ప్రాంతాల్లో పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమని ఆయన పేర్కొన్నారు. బాల కార్మికులను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి వారి రక్షణకు సహకరించాలని కోరారు.బాల కార్మికులను నియమించడాన్ని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) సవరణ చట్టం--1994ను అమలు చేస్తోందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం బాలలను పనిలో పెట్టుకునే యజమానులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రభుత్వంతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్న డాక్టర్ నాగరాజు, చిన్నారుల విద్య, ఆరోగ్యం మరియు భవిష్యత్తు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా సమాజం ఏకతాటిపైకి వచ్చి చిన్నారులకు విద్యాభ్యాసం, సంరక్షణ మరియు సురక్షితమైన బాల్యాన్ని అందించేందుకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.బాల్యం చదువుకోవడానికి, ఎదగడానికి పనులు చేయడానికి కాదు. బాల కార్మిక రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలి" అని డిఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు.

## మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్ సురేష్.



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12(భారత శక్తి ): మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన్నట్లు సర్పంచ్ సురేష్ అన్నారు.శుక్రవారం మండలంలోని మాధవపురం గ్రామంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, మహిళా సంక్షేమానికి పెద్దపీఠం వేస్తుందని అన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పేదలకు పెద్దన్నగా ముఖ్యమంత్రి నిలిచారని అన్నారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉన్నాయన్నారు. గ్రామాన్ని గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,ఉపసర్పంచ్ మద్ది వెంకట్ రెడ్డి, ఎంపిడిఓ రఘుపతి రెడ్డి,ఎంపిఎం శంకర్,సిసి సుమలత,విఓఏ కామాక్షి,శైలజా, కార్యదర్శి మహ్మద్ అజీమ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపడుతున్న మైనర్ రిపేర్ పనులపై సమీక్ష సమావేశం



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 12: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపడుతున్న మైనర్ రిపేర్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం తన చాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న మైనర్ రిపేర్ పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని పంచాయతీ రాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.అలాగే జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతిరోజూ సంబంధిత కళాశాలలను సందర్శించాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో బాన్సువాడ డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ అంజయ్య, కామారెడ్డి డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

## కూతురిని జడ్పీ హైస్కూల్లో చేర్పించిన ఉపాధ్యాయుడు



విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకంతో ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు తీసుకున్న నిర్ణయం అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మునుకుళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కుంభ కృష్ణారావు అనే ఉపాధ్యాయుడు సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చారు. కార్పొరేట్ చదువులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందని ఆయన స్వయంగా నిరూపించారు. ఇప్పటివరకు ఒక ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తన కుమార్తె కే. అఖిలను ఆయన అక్కడి నుండి మాన్పించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై, తాను పనిచేస్తున్న పాఠశాల ప్రమాణాలపై ఉన్న పూర్తి నమ్మకంతో ఆమెను తాను పనిచేస్తున్న మునుకుళ్ళ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోనే 9వ తరగతిలో చేర్పించారు. సాధారణంగా ప్రైవేట్ స్కూళ్ల వైపు మొగ్గు చూపే ఈ రోజుల్లో, ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడే తన బిడ్డను ప్రభుత్వ పాఠశాలలో చేర్చడం విశేషం. ఉపాధ్యాయుడు కుంభ కృష్ణారావు తీసుకున్న ఈ సాహసోపేతమైన, ఆదర్శవంతమైన నిర్ణయాన్ని విద్యాశాఖ అధికారులు, తోటి సిబ్బంది అభినందించారు. తిరువూరు డివిజనల్ విద్యాశాఖాధికారి శ్యామ్ సుందర్ రావు, మునుకుళ్ళ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. మురళీకృష్ణలు ఆయనను ప్రత్యేకంగా అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి మరియు ప్రజల్లో నమ్మకం పెంచడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.

## లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



హుజురాబాద్, జూన్ 12(భారత శక్తి ): హుజురాబాద్ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హుజురాబాద్ మండలశీ లబ్ధిదారుల ఇండ్లకు నేరుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. హుజురాబాద్ మండలంలోని కాట్రపల్లి, పెద్దపాపయ్యపల్లి, కందుగుల, ధర్మరాజుపల్లి, జూపాక, చెల్పూర్, రంగాపూర్, పోతిరెడ్డిపేట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ఆపద సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని, నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. లబ్ధిదారులు తమకు ఆర్థిక సహాయం అందించినందుకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ౦ఛ కార్పొరేషన్ బండ శ్రీనివాస్ పి ఏ సి ఎస్ చెర్మన్ కొండల్ రెడ్డి మాజీ ఎంపీపీ సురేందర్ రెడ్డి మరియు పార్టీ నాయకులు, సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మీసేవ సేవల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి


### – ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు



భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 12 (భారతశక్తి):ప్రజలకు మీసేవ ద్వారా అందిస్తున్న సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ విధానాల అమలుపై ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు అధికారులకు అవగాహన కల్పించారు. శుక్రవారం కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పుల్లయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదేశ్వరరావు మాట్లాడుతూ ఆదాయ, కుల, నివాస, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, ఈబీసీ, ఓబీసీ తదితర సేవలకు సంబంధించిన మీసేవ దరఖాస్తుల పరిశీలన పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించబడుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన డిజిటల్ పత్రాలను మాత్రమే పరిశీలించి నిబంధనల మేరకు ఆమోదం లేదా తిరస్కరణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. భౌతిక పత్రాలను స్వీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిపిఓస్ అండ్ ఎమ్ఆర్ఐఎస్ వెరిఫికేషన్ మొబైల్ అప్లికేషన్ వినియోగంపై అధికారులకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలనను సులభతరం చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించవచ్చని వివరించారు. ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని, అదనపు రుసుములు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దరఖాస్తుల నమోదు సమయంలో వివరాలను కచ్చితంగా నమోదు చేయడంతో పాటు డేటా ఎంట్రీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో అధికారులు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని, సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే సంబంధిత తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.ఈ సమావేశంలో జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ వీఎల్ఈలు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## భరణి నక్షత్రం సందర్భంగా

### శ్రీ యమధర్మరాజు స్వామి వారికి ప్రత్యేక పూజలు



జగిత్యాల, జూన్ 12( భారత శక్తి ప్రతినిధి ): భరణి నక్షత్రం సందర్భంగా అనుబంధ దేవాలయమైన శ్రీ యమధర్మరాజు స్వామి వారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ యమధర్మరాజు స్వామివారికి పురుషసూక్తం, శ్రీలక్ష్మీ సూక్తం, మన్యుసూక్తంతో అభిషేకాలు నిర్వహించారు, అనంతరం ఆయుష్య హోమం, ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, నేరెళ్ల సంతోష్ కుమార్, అర్చకులు వొద్దిపర్తి కళ్యాణ్ కుమార్, అభిషేక పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్,అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బద్వేలు నూతన మున్సిపల్ కమిషనర్‌గా ఎం. కృష్ణ



కడప, జూన్ 12(భారత శక్తి ): బద్వేలు మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం. కృష్ణ శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఎం. కృష్ణ గతంలో హిందూపురం, ఎమ్మిగనూరు, ఆదోని, పెనుగొండ, నంద్యాల మున్సిపాలిటీలలో అదనపు కమిషనర్‌గా సేవలందించారు. అలాగే విజయవాడ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఆయన, ఇటీవల విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయం నుంచి బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.బద్వేలు పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటానని ఈ సందర్భంగా ఎం. కృష్ణ తెలిపారు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

### – డి ఎల్ ఎస్ ఏ సెక్రటరీ రాజేందర్



మణుగూరు, జూన్ 12 (భారతశక్తి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా సహకరించాలని డిఎల్ఎస్ఏ సెక్రటరీ రాజేందర్ పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శ్రీవిద్య టెక్నో జూనియర్ కాలేజ్ నందు శుక్రవారం బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజేందర్ మాట్లాడుతూ మన దేశంలో బాల కార్మిక వ్యవస్థ అనేది ఎక్కువగా ఉందన్నారు. మన భద్రాద్రి జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువగా బాల కార్మికులు వస్తున్నారన్నారు. తక్షణమే అన్ని విభాగాలు కలిసి వారిని బాల కార్మికులు గా ఉండిపోకుండా చదువుకునే విధంగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. మరి ఎక్కువగా 14 సంవత్సరాల లోపు పిల్లలు బాల కార్మికులుగా ఎక్కడైనా పని చేసినట్లయితే తక్షణమే చైల్డ్ లైన్ విభాగానికి సమాచారం అందించాలని తెలిపారు. ఇది ఒక సాంఘిక దురాచారమని వారి చదువులని హరించి వేసే ప్రక్రియ అని తెలిపారు. ఒక కీలకమైన సామాజిక ఆర్థిక సవాలుగా ఇంకా మిగిలి ఉందని బలవంతపు ఆర్థిక కార్యకలాపాల కారణంగా లక్షలాది మంది పిల్లలు తమ బాల్యాన్ని విద్యకు దూరమై సరైన అభివృద్ధిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగం భవన నిర్మాణ సంఘం, ఇటుకల తయారీలో వీరిని ఎక్కువగా వినియోగిస్తున్నారన్నారు. అనంతరం సిఐ నాగబాబు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను సమర్థవంతంగా అరికట్టాలంటే కఠినమైన చట్టాలు అమలతో పాటు తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం, బలమైన సామాజిక భద్రత పథకాలు అందించడం ద్వారా అంతమొందించ వచ్చని తెలిపారు. బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే చైల్డ్ లైన్ 1098 కి గాని డయల్ 100 కి గాని ఫోన్ చేసి తెలపాలని కోరారు. మణుగూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నాగరాజు మాట్లాడుతూ ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తున్నట్టయితే వెంటనే సమాచారం తెలియచేస్తే ప్రత్యక్షంగా నేనే వచ్చి విచారణ చేసి వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే చట్టాలు చాలా కఠిన తరంగా ఉన్నాయని రూ. 20వేల నుండి లక్ష రూపాయల వరకు జరిమానా కూడా విధించబడుతుందని తెలిపారు. అలాగే ఏఐడి ఎన్జీవో లాంటి స్వచ్ఛంద సేవా సంస్థలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరము ఆపరేషన్ స్మైల్ ఆపరేషన్ ముస్కాన్ ద్వారా బాల కార్మికులను గుర్తించి, బాలలను పనిలో పెట్టుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలల శ్రమదోపిడిని అరికట్టి బాలలకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏరియా హాస్పిటల్ డాక్టర్ గౌరీ ప్రసాద్ యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మాట్లాడుతూ చిన్న వయస్సులో పనులు చేపించడం వలన వారి ఇమ్యూనిటీ పవర్ దెబ్బతిని ఎదుగుదల అనేది లోపిస్తుందని చిన్న వయస్సులో ఎక్కువ బరువులు మోయడం వలన శారీరక సమతుల్యత దెబ్బతింటుందని అనారోగ్యాలు ఎక్కువగా పాలయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సేవా సంస్థ కో ఆర్డినేటర్ వి రాజేష్ మాట్లాడుతూ ఏఐడీ సంస్థ గత మూడు సంవత్సరాలుగా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ భాగస్వామ్యంతో భద్రాద్రి కొత్తగూడెంలో బాల కార్మిక వ్యవస్థని నిర్మూలించడానికి తమ వంతు బాధ్యతగా పనిచేస్తుందని అలాగే దీనికి లైన్ డిపార్ట్మెంట్స్ సహకారం ఎప్పుడూ అందుతుందని తెలిపారు. తమ సంస్థ ద్వారా బాల కార్మిక వ్యవస్థను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సమూలంగా నిర్మూలించడానికి కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎల్ ఓ రజిత, మెప్మా టిఎంసి సుశీల, ఆర్ పి ఇందిరా, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ హైమావతి, భద్రమ్మ, భవన కార్మిక సంఘం ప్రెసిడెంట్ శ్రీను, అంగన్వాడీ టీచర్స్, మెప్మా యూనిట్, డి ఎల్ ఎస్ ఏ బాధ్యులు కోటేష్, భవన నిర్మాణ కార్మిక సంగం సభ్యులు, ఏఐడి సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి రాజేష్, మోహన్ జ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలి.

- అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు చేపట్టాలి.
- సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి
- భట్టి విక్రమార్క మల్లు ఆదేశం
- నేడు మంచిర్యాలలో 335 మంది వారసులకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 12: సింగరేణి కార్మికులకు శుభవార్త సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు. ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో నేడు జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి.

అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్సటర్నల్ పోస్టులు ఉండగా 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు. కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదే కాకుండా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామన్నారు.ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా కార్మికులకు లాభాల వాటాను చెల్లించామని తెలియజేశారు. గత రెండేళ్లలో రూ.1500 కోట్లను లాభాల వాటా రూపేనా చెల్లించినట్లు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్సు చెల్లిస్తున్నామని, 2023-24లో ఒక్కొక్కరికీ రూ.5,000 చొప్పున, 2024-25లో రూ.5,500 చొప్పున లాభాల బోనస్సు పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణిలో ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ చేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా గోదావరిఖని లో క్యాథ్ ల్యాబ్ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత మరియు వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాక్లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తుచేశారు. రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే పోటీ మార్కెట్లో సింగరేణి నిల దొక్కుకోవాలంటే ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## సైక్లింగ్ పోటీల గోడ పత్రికను ఆవిష్కరించిన మంత్రి



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 12(భారత శక్తి): ములుగు జిల్లా కేంద్రంలో ఈ నెల 14న జరుగనున్న అస్మిత ఖేలో ఇండియా బాలికల సిటీ సైక్లింగ్ పోటీల గోడ పత్రికను పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క తోపాటు కలెక్టర్ ధోర్డే హేమంత్ సహదేవరావు, డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జీ, లోకల్ బాడీ అదనపు కలెక్టర్ సంపత్ రావు లతో కలిసి ఆవిష్కరించారు.జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని,విజేతలకు మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు మెడల్స్ అందజేస్తారని బాదం ప్రవీణ్ పేర్కొన్నారు. అదేవిధంగా ఈ పోటీల్లో పాల్గొన్నవారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ సైతం అందిస్తున్నారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు తమ సొంత సైకిల్ తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ లు తెచ్చుకోవాలని వారు అన్నారు.ఆసక్తి కలవారు ఈ నెల 12 తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.పూర్తి వివరాలకు సైక్లింగ్ కోచ్ శ్రీరామ్ నంబర్ 8886817492 సంప్రదించాలని వారు కోరారు. సైక్లింగ్ పోటీలో పాల్గొనే క్రీడాకారుని లకు సైకిలు లేనియెడల జిల్లా అసోసియేషన్ సైకిళ్ళు ఏర్పాటు చేయడం జరుగుతుందని,అందువల్ల ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని క్రీడలను విజయవంతం చేయాలని క్రీడాకారులకు వారు పిలుపునిచ్చారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం

## టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు



జగిత్యాల, జూన్ 12 (భారత శక్తి ప్రతినిధి): జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని, జిల్లాలోని సభ్యులందరికీ త్వరలో ఐడీ కార్డులు అందజేస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 70 శాతం ఐడీ కార్డుల తయారీ పూర్తైందని, మిగిలిన సభ్యుల వివరాలు అందిన వెంటనే పంపిణీ చేస్తామని చెప్పారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అందేలా కృషి చేస్తామని, జిల్లాలో మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని, సంస్థ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగుల గోపాల్ చారి, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, అల్లె రాము, లోక రమణారెడ్డి, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, సహాయ కార్యదర్శులు గుర్రం చంద్రశేఖర్, కోరేపు రాజ్‌కుమార్, చింత నరేష్, కార్యవర్గ సభ్యులు మనోజ్, శంకర్ గౌడ్, రఘుపతి రెడ్డి, హరీష్, నరేష్, సాజిద్, జమీర్ అలీ, గౌస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభకు వేదికైన సమ్మర్ క్యాంప్

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ధర్మపురి సీఐ రాం నరసింహారెడ్డి







జగిత్యాల, జూన్ 12 (భారత శక్తి ప్రతినిధి): ఇషా ఇనిస్ట్యూషన్ ఆధ్వర్యంలో వేసవి సెలవులను పురస్కరించుకుని నిర్వహించిన కూచిపూడి నృత్య శిక్షణ శిబిరం శుక్రవారం ధర్మపురిలోని మాతృశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ముగిసింది. నెల రోజుల పాటు కొనసాగిన ఈ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులు కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందడంతో పాటు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. శిబిరం ముగింపు కార్యక్రమానికి ధర్మపురి సీఐ రాం నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ కళలను చిన్ననాటి నుంచే అభ్యసించడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక వికాసం పెంపొందుతాయని అన్నారు. ప్రస్తుతం పిల్లలు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు ఎక్కువ సమయం కేటాయిస్తున్న నేపథ్యంలో వారిని సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లించడంలో ఇటువంటి శిక్షణా శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఇషా ఇన్‌స్టిట్యూషన్‌లో కంప్యూటర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లు, మెమెంటోలు ప్రదానం చేసి అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు కళలు, సాంకేతిక నైపుణ్యాలను కూడా అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నృత్య శిక్షకురాలు గుండి యమున, ఇషా ఇనిస్ట్యూషన్ నిర్వాహకులు పాకాల రాజేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుమామిళ్లలో జేసీ నిధి మీనా ప్రత్యక్ష వినతి స్వీకారం

## కార్యక్రమములో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ సూర్య నారాయణరెడ్డి




పోరుమామిళ్ల (భారతశక్తి ప్రతినిధి) జూన్ 12 :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా, పారదర్శకంగా మరియు సమర్థవంతమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో చేపట్టిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక - ఒక నియోజకవర్గం, ఒక నెల, నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల మండలంలో రెండవ పర్యటనను శుక్రవారం నిర్వహించారు. కడప జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా, ఐఏఎస్ ఆధ్వర్యంలో పోరుమామిళ్లలోని శ్రీ పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ప్రజల నుండి నేరుగా వినతులు స్వీకరించిన జాయింట్ కలెక్టర్, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా బద్వేల్ డివిజన్ ఆర్డీవో ఏ. చంద్రమోహన్, కడప జిల్లా డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. మొత్తం 301 మంది అర్జీదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# తాలిపేరు ఎడమ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలి.

## -ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి. జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 12 (భారతశక్తి): దుమ్ముగూడెం మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువతో పాటు దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాగునీటి సరఫరా, వైద్య సేవల నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మొదటగా వీరభద్రపురం గ్రామం పరిధిలోని తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువను పరిశీలించిన కలెక్టర్, కాలువ పరిస్థితులు, నీటి ప్రవాహం, ఆయకట్టు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాలిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24,700 ఎకరాల భూమికి సాగునీరు అందుతుండగా, ఎడమ కాలువ 46.46 కిలోమీటర్ల పొడవుతో 34 డిస్ట్రిబ్యూటరీల ద్వారా సుమారు 21,100 ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కాలువలో పెరిగిన గడ్డి, చెత్త, పూడికను వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సాగునీరు సకాలంలో అందేలా కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరేలా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అనంతరం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవల నిర్వహణపై సమగ్రంగా ఆరా తీశారు. ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు, సేవల నిర్వహణను పరిశీలించారు. ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చిన విద్యార్థులతో మాట్లాడి వారి వివరాలను తెలుసుకున్న కలెక్టర్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీకి అనుసరిస్తున్న విధానంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఔషధ నిల్వల గదిని పరిశీలించి మందుల నిల్వలు, అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. అలాగే ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ రిజిస్టర్లు, ఇతర వైద్య రికార్డులను పరిశీలించారు. పాముకాటు, తేలు కాటుకు గురైన రోగులకు అవసరమయ్యే అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాముకాటుకు గురైన వ్యక్తికి అందించే చికిత్స విధానం, అనుసరించే వైద్య ప్రోటోకాల్‌పై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు కాలువల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని, అలాగే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ అశోక్ కుమార్ ఇరిగేషన్ ఈఈ జానీ, డాక్టర్ రుక్మాకర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి

## – జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 12 (భారత శక్తి) జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 1 లక్షా 58 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి, గోదాములకు తరలించినట్లు వివరించారు. 1 లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులు, గోదాములకు తరలించినట్లు పేర్కొన్నారు. 30 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంట దిగుబడి రాగా, ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంటను కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని మరో మూడు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేస్తామని తెలిపారు. పంట కొనుగోలుకు సంబంధించి, డబ్బులను ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయగలిగామని చెప్పారు. రానున్న పంట కాలానికి సంబంధించి రైతులకు ఎరువుల కొరత రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులెవరూ కూడా యూరియా




లభ్యతపై ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, జిల్లాలో సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని అన్నారు. ప్రస్తుతం 10734 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

రైతులు వారి అవసరాన్ని బట్టి యూరియా బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలని చెప్పారు. ప్రతి ఎరువుల దుకాణం వద్ద ప్రత్యేకంగా ఒక పోస్టరును అందుబాటులో ఉంచుతామని, ఇందులో ఎరువుల ధరలు, తదితర వివరాలు ప్రదర్శించబడతాయని అన్నారు. రైతుల వద్ద ఎరువుల కోసం అధిక ధరలు వసూలు చేస్తే, 8977751754 నంబరును



సంప్రదించవచ్చునని వివరించారు. ఎరువుల దుకాణదారులు, రైతుల వద్ద నుంచి అధిక డబ్బులు తీసుకోరాదని హెచ్చరించారు. అధిక డబ్బులు తీసుకునే దుకాణదారులపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఇప్పటికే అధిక ధరలకు ఎరువులను విక్రయించిన పలు దుకాణదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమవుతున్నందున, ప్రజలకు ఈ ప్రక్రియపై మీడియా మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, మార్క్ ఫెడ్ డీఎం మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ అధికారి రమణ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన సిద్ధాంతాల కోసం నిరంతర సేవలు అందిస్తున్న శీలంశెట్టి లక్ష్మయ్యకు 50వ జన్మదిన శుభాకాంక్షలు



పోరుమామిళ్ల (భారతశక్తి ప్రతినిధి) జూన్12: వైఎస్సార్ కడప జిల్లా, బద్వేల్ నియోజకవర్గం, పోరుమామిళ్ల మండలం, పంచాయతీ 7వ వార్డుకు చెందిన శీలంశెట్టి లక్ష్మయ్య 1977 జూన్ 12న జన్మించారు(జూన్ 9వ తేదీ శీలంశెట్టి నందిని బర్త్డే,జూన్ 12వ తేదీ శీలం శక్తి నరేష్ బర్త్డే,జూన్ 12 శీలంశెట్టి లక్ష్మయ్య బర్త్డే జూన్ 20వ తేదీ శీలంశెట్టి లక్ష్మయ్య, సతీమణి విజయలక్ష్మి యొక్క మ్యారేజ్ డే, )రాజకీయ ప్రస్థానాన్ని కాంగ్రెస్ పార్టీతో ప్రారంభించిన ఆయన, అనంతరం జనసేన పార్టీ అధ్యక్షులు, పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చడంతో 2014లో జనసేన పార్టీలో చేరారు. చిన్నచిన్న పార్టీ కార్యక్రమాలతో ప్రారంభమైన ఆయన సేవా ప్రస్థానం, 2021 స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైనప్పటికీ మరింత బలంతో, పౌరుషంతో విస్తరించింది. ఆయన సతీమణి కూడా జనసేన వీరమహిళగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ లక్ష్మయ్యకు ఎల్లప్పుడూ అండగా నిలిచారు. 2023 లో పోరుమామిళ్ల పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని స్థాపించిన లక్ష్మయ్య, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అనేక పాదయాత్రలు నిర్వహించారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ సామాన్యుల గొంతుకగా నిలిచారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ అన్నదాన కార్యక్రమాలు, పేదలకు సహాయం, సామాజిక సేవా కార్యక్రమాలు, యువతకు ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టి ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నారు. 2024లో పోరుమామిళ్లలో జనసేన పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన ఆయన, పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ నాయకులు, కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చారు. గ్రామ గ్రామాన పార్టీ సిద్ధాంతాలను చాటుతూ జనసేన జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రజాసేవే పరమావధిగా, పార్టీ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న శీలంశెట్టి లక్ష్మయ్య గారు మరెన్నో విజయాలు సాధించి, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఆకాంక్షిస్తున్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలి

## - న్యాయ విజ్ఞాన సదస్సులో లీగల్ సర్వీస్ న్యాయవాది కాట్రోత్ రాజు నాయక్ పిలుపు




మెదక్ జిల్లా నర్సాపూర్, జూన్ 12:( భారత శక్తి న్యూస్): జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ,మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సాపూర్ మండలంలోని తుల్జారంపేట గ్రామ డ్వాక్రా సంఘంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లీగల్ సర్వీస్ న్యాయవాది జె.రాజు నాయక్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ సమాజానికి శాపంగా మారిందని, దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. చదువుకోవాల్సిన వయస్సులో ఉన్న బాలబాలికలను పనుల్లో పెట్టకుండా, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్ల సౌకర్యాలను వినియోగించుకుని వారికి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. చిన్నారులను ఉన్నత విద్యాభ్యాసం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరేలా తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు కృషి చేయాలని ఆయన అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో డ్వాక్రా మహిళలు కీలక పాత్ర పోషించాలని, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంపొందించి చిన్నారుల హక్కులను పరిరక్షించాలని కోరారు. అలాగే ఎవరైనా చట్టవిరుద్ధంగా చిన్నపిల్లలను పనిలో పెట్టుకున్నా లేదా వారితో పని చేయించినా సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సి. హెచ్. స్వరూప రాణి,న్యాయవాది జాట్రోత్రవి నాయక్, ఇంద్రకాంతి పథకం సీసీ ప్రమీల, లీగల్ సర్వీస్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా

# కలిసిన అసిస్టెంట్ కలెక్టర్లు.



కడప, జూన్ 12(భారత శక్తి ) : క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన ఎనిమిది మంది అసిస్టెంట్ కలెక్టర్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాల క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లాలోని సుప్రసిద్ధ పర్యాటక కేంద్రం గండికోటను సందర్శించిన అసిస్టెంట్ కాలెక్టర్ల బృందం.. అనంతరం రాష్ట్రానికే స్ఫూర్తిగా జిల్లా కలెక్టర్ వినూత్న అవిష్కరణతో అమలులోకి వచ్చిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థను ప్రత్యక్షంగా పరిశీలించారు. అందులో భాగంగా ఎర్రగుంట్ల స్మార్ట్ కిచెన్ భవనాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం కడపలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని ఆయన బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దంపతులు వారితో కలిసి మధ్యాహ్న విందును చేసి.. చక్కటి ఆతిధ్యం అందించారు. శిక్షణలో భాగంగా.. పరిపాలన సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్ నుండి పలు సూచనలు, సలహాలను స్వీకరించిన అసిస్టెంట్ కలెక్టర్లు కడప జిల్లా చారిత్రక వైభవానికి ఫిదా అయ్యామని ఇక్కడి పర్యాటక వనరులు, ఇక్కడి ప్రజల స్వభావం, జీవనశైలి మమకారం మేళవించినట్లుందని సంతోషం వ్యక్తం చేశారు. మొదటిసారిగా జిల్లాకు వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్లకు చిరు కానుకను అందజేసి సత్కరించారు. కాగా చక్కటి ఆతిధ్యం అందించిన జిల్లా కలెక్టర్ దంపతులకు వారు ధన్యవాదాలు తెలియజేసారు.సాయంత్రం జిల్లాలోని చారిత్రక, పురాతన శ్రీ ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయంలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్ల బృందం.. జిల్లాలో పర్యటనను ముగించుకుని వెళ్లారు.క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన వారిలో అసిస్టెంట్ కలెక్టర్లు సిహెచ్. శ్రవణ్ కుమార్ రెడ్డి, (ఏలూరు), హరిఓం పాండ్య (శ్రీకాకుళం), జిల్లా ఆదిత్య శర్మ (తూర్పుగోదావరి), నమ్రత్ అగర్వాల్ (కృష్ణా), పవన్ తేజ ఏఆర్ (ఎస్పీఎస్ నెల్లూరు), ప్రియా (కాకినాడ), సుయాస్ కుమార్ (అనంతపురం), వెంకటేష్ బన్న (చిత్తూరు) ఉన్నారు. ఈ కార్యక్రమంలో వారివెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, స్మార్ట్ కిచెన్స్ జిల్లా నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర బహిరంగ సభను జయప్రదం చేయండి

### వ్యవసాయ కార్మిక సంఘం

### జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప



వికారాబాద్ జూన్ 12 భారత శక్తి యాలాల... తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ మహాసభలు మహబూబ్ నగర్ లో ఈ నెల 20,21,22 తేదీలల్లో జరుగుతున్నాయి అని ఈ సభలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం యాలాల మండల పరిధిలోని కమాల్ పూర్ గ్రామం లో కూలీలతో కలిసి మహాసభల కరపత్రం ఆవిష్కరణ చేశాడు. ఈ సందర్భంగా బుగ్గప్ప మాట్లాడుతూ వలసలకు నిలయమైన పాలమూరు జిల్లాలో రాష్ట్ర మహాసభలను అత్యంత ప్రతిష్టశీగా నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు.ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ గారు హాజరు అవుతారు అని రాష్ట్ర నలుమూలల నుండి ప్రతినిధులు మరియు పక్క ఐదు రాష్ట్రల ముఖ్య నాయకులు పాల్గొంటున్నారనితెలిపాడు.ఈ మహాసభలకు పార్టీలకు అతితంగా సహకరించాలని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుది అని అన్నారు. కేంద్రం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను తొలిగించి,కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్స్ లను తీసుకురావడం జరిగింది అన్నారు. కొనుగోలు శక్తి పెంచడానిక. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు కార్మిక విధానలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం రాబోయే కాలంలో పెద్దఎత్తున పోరాటలు చేయడానికి ఈ మహాసభలు పునాదిగా మారుతాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు టీ.లాలయ్య, వెంకటేష్, ఉషాప్ప, శ్రీనివాస్, కుర్వ శ్రీను, నరేష్ ,లక్ష్మి, మరియు ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

# బీరంగూడ స్మశాన వాటిక కబ్జా నుండి కాపాడండి.



అమీన్ పూర్ జూన్ 12 భారత శక్తి బీరంగూడ స్మశాన వాటిక కబ్జా నుండి కాపాడి సమాధులు తొలగించిన వారిని కఠినంగా శిక్షించాలని బీరంగూడ గ్రామ అధ్యక్షులు అదెల్లి రవీందర్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ కి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా గ్రామ పెద్దలు అదెల్లి రవీందర్ ఎడ్ల రమేష్ రమేశగౌడ్ మాట్లాడుతూ బీరంగూడ స్మశాన వాటిక అనుకోని 993 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమి కబ్జా చేయడానికి ప్రయత్నస్తూ బీరంగూడ గ్రామస్తుల సమాధులు తొలగించరాని తక్షణమే కబ్జాదారులను కఠినంగా శిక్షిస్తూ బీరంగూడ స్మశాన వాటిక కబ్జా కాకుండా తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. తక్షణమే చర్యలు తీసుకొంటామని డిప్యూటీ తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో బీరంగూడ కమిటీ అధ్యక్షులు అదెల్లి రవీందర్ మాజీ కౌన్సిలర్ ఎడ్ల రమేష్ నందరం రమేష్ గౌడ్ ఉపాధక్షులు పిర్జపతి సత్యనారాయణ నక్కలకిష్టయ్య ప్రధాన కార్యదర్శి చిన్న వీరేశం కార్యదర్శి దండు జ్ఞానేశ్వర్ కోశాధికారి బంటు శివ కార్యవర్గ సభ్యులు బంటు ప్రవీణ్ మాకం బిక్షపతి ప్రభాకర్ ఎడ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రక పాలన... పరిణామాత్మక నాయకత్వం



భారత ప్రజాస్వామ్య చరిత్రలో 2026 జూన్ 10న ఓ కొత్త అధ్యాయం పూర్తయింది. నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా 4,399 రోజుల నిరంతరాయ పాలన ద్వారా ఆ తేదీ నాటికి చరిత్ర సృష్టించారు. అత్యంత సుదీర్ఘకాలం పదవిలో కొనసాగిన ప్రధానిగా నమోదైన ఈ రికార్డు దేశ పురోగమనంపై ఆయన అచంచల నిబద్ధతను చాటిచెబుతోంది. ప్రజా సంక్షేమం, వారి ఆకాంక్షలపై ఆయన స్థిరమైన అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుంది. అలాగే, దూరదృష్టి గల ఆయన నాయకత్వంపై దేశ ప్రజల చెక్కుచెదరని నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. పరిణామాత్మక నాయకత్వానికి 4,399 రోజులు పూర్తి... కొనసాగింపు సుపరిపాలనతోపాటు 'దేశమే ప్రధానం' అనే సూత్ర నిబద్ధతగల ప్రధాన సేవకుడుగా నరేంద్ర మోదీ దేశంలో అసాధారణ రూపాంతరీకరణ శకానికి నాంది పలికారు. ఒకనాడు అత్యంత అమానుష బానిసత్వ పీడనను నిర్మూలించి, లక్షలాది ప్రజానీకం ఆత్మగౌరవంతో జీవించేలా చేసిన అబ్రహం లింకన్ నాయకత్వ పటిమను మానవాళి చరిత్ర నేటికీ గౌరవిస్తున్నది. అదే తరహాలో 25 కోట్ల మందికి పైగా ప్రజలను దుర్భర పేదరికం నుంచి విముక్తం చేసిన నరేంద్ర మోదీని కూడా భవిష్యత్తరాలు స్మరించుకుంటాయి. ఆయన దార్శనికత, అవిరళ కృషి, పరిణామాత్మక పాలన వల్ల అసంఖ్యాక కుటుంబాలకు అవకాశాలు అందివచ్చాయి. ఆత్మగౌరవం, ఆకాంక్షలకు సాధికారత సహా ఆర్థిక స్వేచ్ఛ, మెరుగైన భవిష్యత్తుకు భరోసా లభించింది. మానవాళి సేవలో ఆయన కృషి ఓ కీలక ఘట్టంగా చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. మరోవైపు ఆయన చేపట్టిన వినూత్న కార్యక్రమాలు విద్య, గృహ వసతి, పారిశుధ్యం, ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత తదితరాల ద్వారా లక్షలాది ప్రజలకు గౌరవాన్ని, సామాజిక భద్రతను కల్పించాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజారోగ్య కార్యక్రమాలలో ఒకటైన ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 44 కోట్ల మందికి పైగా పౌరులకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ భరోసా లభించింది. అలాగే, జల్ జీవన్ మిషన్ ద్వారా 12 కోట్లకు పైగా గ్రామీణ కుటుంబాలకు నేడు సురక్షిత, విశ్వసనీయ తాగునీటి సరఫరా సదుపాయం కలిగింది. బిందెడు నీటికోసం బండెడు దూరం నడిచే ప్రయాస తప్పి.. ముఖ్యంగా మహిళలకు జీవన నాణ్యత మెరుగుపడింది. అంతేగాక 2020 నుంచి ఉచితంగా ఆహార ధాన్యాల నిరంతర పంపిణీతో దాదాపు 80 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత లభించడం వల్ల దుర్బల వర్గాలు వెనుకబాటు నుంచి విముక్తమయ్యాయి. దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా కుటుంబాలకు సురక్షిత, శాశ్వత సొంత ఇంటి కల సాకారమైంది. ఇది వారిలో భద్రత భావాన్ని, గౌరవాన్ని కలిగించి, భవిష్యత్తుపై ఆశలు చిగురించేలా చేసింది. ప్రతి భారతీయుడి సంక్షేమం దిశగా ఆయన తిరుగులేని నిబద్ధతకు, మానవీయ దృక్పథ సహిత పాలనకు ఈ కార్యక్రమాలన్నీ శాశ్వత ప్రతీకలుగా నిలుస్తాయి. సమాజంలోని ప్రతి వర్గం- మహిళలు, యువత, రైతులు, అణగారిన వర్గాల ప్రజానీకం మొత్తానికీ ప్రధాని మోదీ దార్శనికత సాధికారతనిచ్చింది. దేశవ్యాప్తంగా 3 కోట్ల మందికి పైగా మహిళలు లక్షాధికారులుగా ఆవిర్భవించడం, మహిళల సారథ్యంలో అభివృద్ధి సూత్రం ఆయన దార్శనికతకు ఒక శక్తిమంతమైన నిదర్శనం. నారీశక్తి అభ్యున్నతి దిశగా చేపట్టిన కార్యక్రమాలు దేశ పురోగమనంలో మహిళలు మరింత కీలక పాత్ర పోషించేలా తోడ్పడ్డాయి. కొత్త 'ఐఐటీ'లు, ఎయిమ్స్, వైద్య కళాశాలలు, ఉన్నత విద్యా సంస్థల స్థాపనతో భారత విద్యా, ఆరోగ్య సంరక్షణ రంగాలు గణనీయంగా విస్తరించి యువతరానికి అపార అవకాశాలను సృష్టించాయి. అదే సమయంలో అద్భుత మౌలిక సదుపాయాల విప్లవానికి యావద్దేశం సాక్ష్యంగా నిలిచింది. వందే భారత్ రైళ్లు, విమానాశ్రయాలు, రహదారులు, రైల్వే స్టేషన్ల సత్వర విస్తరణ తదితరాల నుంచి మారుమూల ప్రాంతాలకు అనుసంధానం కల్పించే వినూత్న ప్రాజెక్టుల దాకా ఓ ఆధునిక, అనుసంధానిత, ఆకాంక్షభరిత భారత్‌కు ఆయన నాయకత్వం పునాది వేసింది. ఈ విజయాలన్నీ దేశంలో ఆర్థిక వృద్ధిని వేగిరపరచడమే కాకుండా లక్షలాది పౌరుల జీవన నాణ్యతను కూడా మెరుగుపరిచాయి. డిజిటల్ ఆవిష్కరణలు, సెమీ-కండక్టర్ అంతరిక్ష సాంకేతికత, టీకాల రూపకల్పన, మొబైల్ తయారీ రంగాల్లో భారత్ ప్రపంచ అగ్రగామిగా రూపొంది, ఆధునిక సాంకేతికతల రీత్యా అంతర్జాతీయ స్థాయిని మరింత పెంచుకుంది.

### సంప్రదాయ సహిత వికాసం... తమిళ వారసత్వానికి గౌరవం.. తమిళనాడు ముందంజ

ప్రగతి.. సంప్రదాయం పరస్పర విరుద్ధాలు కావు... పరస్పరాశ్రితాలనే దృఢ విశ్వాసమే సమకాలీన నాయకులతో పోలిస్తే ఆయన ప్రత్యేకతను చాటుతుంది. "వారసత్వ సహిత వికాసం" అనే దూరదృష్టి గల ఆయన, ఏ దేశమైనా తన నాగరిక వారసత్వంతో లోతుగా ముడిపడి ఉంటూనే వేగంగా పురోగమించగలదని నిరూపించారు. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, తయారీ సహా సామాజిక సంక్షేమం వంటి రంగాల్లోనూ ఆయన సారథ్యాన భారత్ పరిణామాత్మక ప్రగతిని సాధించింది. అదే క్రమంలో ప్రాచీన సంస్కృతి, భాషలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ ప్రతిష్ట ఇనుమడించాయి. పవిత్ర క్షేత్రాల పునరుద్ధరణ, సాంస్కృతిక చిహ్నాల పునరుజ్జీవనం, ప్రాచీన భాషలకు గౌరవం, అమూల్య కళాఖండాల పరిరక్షణ తదితరాల విషయంలోనూ ఆధునిక ఆకాంక్షలు, శాశ్వత విలువల అరుదైన సమ్మేళనాన్ని ఆయన పాలన ప్రతిబింబిస్తుంది.ప్రధానమంత్రి మోదీ విధానం దేశ పురోగమనాన్ని వినూత్నంగా నిర్వచించింది. దేశ వాస్తవిక వృద్ధికి ఆర్థిక ప్రగతి ఒక్కటే ప్రమాణం కాదని ఆయన స్పష్టం చేశారు. వారసత్వ పరిరక్షణ, దాన్ని భావితరాలకు సంక్రమింపజేసే సామర్థ్యం కూడా అందుకు కొలబద్ద కాగలదని నిరూపించారు. ఘనమైన గతం వెన్నుదన్నుగా భవిష్యత్తులోకి ధైర్యంగా పాదంమోపే ఆత్మవిశ్వాసంతో కూడిన భారత్ పునరుజ్జీవనానికి ఆయన నిర్దేశించిన "వారసత్వ సహిత వికాసం" మార్గదర్శక సూత్రంగా మారింది.తమిళనాడుతోపాటు అంతర్జాతీయంగా విస్తరించిన తమిళ సమాజం ఈ సిద్ధాంతంతో అత్యధిక లబ్ధి పొందాయి. వారి సుసంపన్న భాషా, సాంస్కృతిక, నాగరిక వారసత్వానికి ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో అసాధారణ గుర్తింపు, మద్దతు లభించాయి. చెన్నై మెట్రో రైలు విస్తరణ, చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే, తమిళనాడు రక్షణ పారిశ్రామిక కారిడార్, ఓడరేవులు-విమానాశ్రయాల ఆధునికీకరణ, జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి, సరికొత్త పంబన్ రైలు వంతెన వంటివి ప్రధాని మోదీ నేతృత్వాన తమిళనాడు పరిణామాత్మక ప్రగతికి తోడ్పడిన కొన్ని కార్యక్రమాలు. భారత దేశంలో సముద్రంపై తొలి నిట్టనిలువుగా లేచే పంబన్ రైలు వంతెన ప్రారంభోత్సవం ఓ కీలక ఘట్టంగా నిలుస్తుంది. భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీక అయిన ఈ వంతెన రామేశ్వరం పుణ్యక్షేత్రానికి అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. ఇక స్వయసమృద్ధ భారత్ దృక్కోణాన్ని దృఢంగా కొనసాగించడం వల్ల, ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్లు, ఐఫోన్ తయారీ తదితరాలకు తమిళనాడు ఒక ప్రసిద్ధ కూడలిగానూ ఆవిర్భవించింది.తమిళ భాష, సంస్కృతి, వారసత్వాలను నరేంద్ర మోదీ తరహాలో ఇంత నిలకడగా, విస్తృతంగా, ప్రపంచవ్యాప్త ప్రాచుర్యంతో మునుపటి ప్రధానమంత్రులెవరూ ముందుకు తీసుకెళ్లలేదు. తమిళ నాగరికతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయనొక కొత్త గుర్తింపు తెచ్చారు. దేశవిదేశాల్లో తమిళ భాష ప్రాచీనతను, సాహితీ వైభవాన్ని ఆయన నిరంతరం కీర్తించడం ప్రపంచవ్యాప్త తమిళుల హృదయాలను గాఢంగా హత్తుకుంది. మహనీయుడైన ప్రాచీన తమిళ సాధువు 'కణియన్ పూంగుంరనార్' ప్రవచించిన "యాత్తుం ఊరే.. యావరుమ్ కేళిర్" (అన్ని ఊళ్లూ నావే... అందరూ నా వారే) అనే నిత్యసత్య వాక్కును ఐక్యరాజ్యసమితిలో ఆయన ఉచ్చరించిన క్షణం తమిళ నాగరికతకు, భారతదేశానికి ఎంతో గర్వకారణం. ఈ గంభీర సందేశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తేవడం ద్వారా, తమిళ సంస్కృతిలో, దాని సుసంపన్న నాగరిక వారసత్వంలో నిబిడీకృతమైన కాలాతీత మానవతా విలువలను ఆయన ప్రపంచానికి చాటారు. కార్ల్ మార్క్స్‌కు శతాబ్దాల ముందే తమిళులు "యావత్ మానవాళి ఒకటే"ననే ఉదాత్త భావనను సమర్థించారని ప్రపంచ ప్రజానీకం కూడా ఇప్పుడు గ్రహించింది. "వసుధైవ కుటుంబకం" మూలాలు కూడా ఇందులో కనిపిస్తాయి.ఇక కాశీ తమిళ సంగమం, సౌరాష్ట్ర తమిళ సంగమం వంటి కార్యక్రమాలు సాంస్కృతిక బంధాలను బలోపేతం చేస్తూ, దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చే శాశ్వత నాగరికతా బంధంతో పెనవేశాయి. భారత ప్రజాస్వామ్య, నాగరికతా వారసత్వానికి తమిళనాడు చేసిన సేవకు మన కొత్త పార్లమెంటు భవనంలో సెంగోల్ ప్రతిష్ఠాపన తగిన గుర్తింపు. గంగైకొండ చోళపురంలో ప్రధానమంత్రి శ్రీ మోదీ పర్యటన చోళుల వారసత్వ ఘనతను చాటిచెప్పింది. ఇటీవల ఆనైమంగళంలోని చోళుల కాలం నాటి రాగి ఫలకాలు సహా, విదేశాల నుంచి అమూల్య కళాఖండాలు, పురాతన వస్తువులను స్వదేశం రప్పించేందుకు చేపట్టిన కార్యక్రమాలకు విస్తృత ప్రశంసలు లభించాయి. ఆలయాలు, వారసత్వ ప్రదేశాలు, ప్రాచీన సాహిత్యం, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణ దిశగా చేయూత సహా ఇతరత్రా ఆయన చేసిన కృషి తమిళ నాగరికతకుగల అంతర్జాతీయ స్థాయిని కొత్త ఎత్తులకు చేర్చాయి. తమిళ భాష, సంస్కృతిపై ఆయనకు గల నిరంతర గౌరవాన్ని ప్రతిబింబించాయి.

### ఉపసంహారం

ప్రతి యుగంలోనూ సమకాలీన హద్దులకు ఆవలి అంచులను స్పృశించగల దార్శనికత, కార్యాచరణ గల నాయకులు చరిత్రలో అరుదుగా కనిపిస్తుంటారు. ఒక దేశ భవిష్యత్తును తీర్చిదిద్ది, తరతరాలకూ స్ఫూర్తినిస్తారు కాబట్టే అలాంటి 'యుగపురుషులు'గా భావితరాలు గుర్తుంచుకుంటాయి. ఆ కోవలోనే పరిణామాత్మక నాయకత్వం, జాతి ప్రగతిపై అకుంఠిత దీక్ష, ప్రజలకు అవిశ్రాంత సేవ వంటి సుగుణాలున్న సమకాలీన భారత వాస్తవ 'యుగపురుషుడు'గా ఆయనను అభివర్ణించడంలో అతిశయోక్తి లేదు. ఆయన సమర్థ నాయకత్వం ఈ దేశాన్ని 2047 నాటికి 'వికసిత భారత్'గా రూపుదిద్దగలదన్నది నా ప్రగాఢ విశ్వాసం.

(వ్యాసకర్త భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్)

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం.

## ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డా. ధోని శ్రీనివాసమూర్తి పిలుపు




కడప, జూన్ 12(భారత శక్తి ): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ భారత సంపదైన బాలల హక్కుల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డా. ధోని శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడపలో పర్యటించిన ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కార్మిక, పోలీసు, మహిళా శిశు సంక్షేమ శాఖలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మెకానిక్ షాపులు, హోటళ్లు, గ్యారేజీలు, గనులు, సిమెంట్ పరిశ్రమల్లో బాల కార్మికుల నియామకాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠినమైన శిక్షలు ఉంటాయని ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. 1098 బాలల సహాయవాణి సేవలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి గ్రామ, వార్డు సచివాలయం బాలల రక్షణ కేంద్రంగా మారాలని సూచించారు.మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో కీలక పాత్ర పోషించాలని కోరారు. ప్రతి గ్రామసభలో బాలల సంక్షేమ అంశాలను అజెండాలో చేర్చాలని సూచిస్తూ, బాల కార్మిక నిర్మూలనకు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశ్రమం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

### ఆహార భద్రతలో నిర్లక్ష్యం తగదు.

అంతకుముందు స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లోని స్మార్ట్ కిచెన్‌ను సందర్శించిన డా. శ్రీనివాసమూర్తి, వంట సిబ్బంది తప్పనిసరిగా చేతి తొడుగులు, తల టోపీలు, ఏప్రాన్‌లు ధరించాలని సూచించారు. వంట పాత్రలను వేడి నీటితో శుభ్రపరచాలని, ఆహార తయారీలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా వేలాది మంది విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఆహారాన్ని పరిశీలించి, నాణ్యతతో పాటు రుచికరంగా తయారు చేస్తున్నందుకు సిబ్బందిని అభినందించారు.

### అమ్మఒడి ఆశ్రమంలో బాలలతో సహపంక్తి భోజనం

స్థానిక రామాంజనేయపురంలోని రెవెన్యూ సేవా సమితి నిర్వహిస్తున్న అమ్మఒడి ఆశ్రమాన్ని సందర్శించిన డా. శ్రీనివాసమూర్తి, అక్కడి బాలలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆశ్రమంలో అందిస్తున్న విద్య, వసతి, పోషకాహార సదుపాయాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు.

### జైళ్లలో బాలల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

కడప సెంట్రల్ జైలు, మహిళా జైలును సందర్శించిన ఆయన, రిమాండ్ ఖైదీలలో 18 సంవత్సరాల లోపు బాలలు ఎవరైనా ఉన్నారా అనే విషయాన్ని పరిశీలించారు. జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీలతో మాట్లాడి, వారి పిల్లలు 18 సంవత్సరాల లోపు ఉంటే బాలల హక్కుల కమిషన్ ద్వారా అందుబాటులో ఉన్న సేవలను పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా మహిళా జైలులో ఖైదీలు, వారి పిల్లలకు అందుతున్న సేవలపై కూడా సమాచారం సేకరించారు.

### అంగన్‌వాడీ సేవల మెరుగుదలకు సూచనలు

సాయంత్రం సీకే దిన్నె మండలంలోని బుగ్గలపల్లి హరిజనవాడను సందర్శించిన డా. శ్రీనివాసమూర్తి, అంగన్‌వాడీ కేంద్రంలో



సేవలు పొందుతున్న లబ్ధిదారులతో మాట్లాడారు. కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖాధికారి షంసుద్దీన్, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీమతి పి. రామదేవి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎ.టి. శ్రీనివాసులు, పోలీసు శాఖ అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రతినిధులు, న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, బాలబాలికలు పాల్గొన్నారు.

# కడప సెంట్రల్ జైలు జీవిత ఖైదీ పరార్

**గూడూరు(భారత శక్తి)** కడప సెంట్రల్ జైలు లో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీ పరారయ్యాడు. నంద్యాల కానిస్టేబుల్ హత్య కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కుమార్ మరియు పోక్సో కేసులో 20 ఏళ్ళు జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. అనారోగ్య కారణాల వల్ల ఏప్రిల్ నెలలో విశాఖ మానసిక ఆసుపత్రికి తరలించి, తిరిగి జైలుకు తరలిస్తుండగా గూడూరు రైల్వే స్టేషన్లో తప్పించుకుని పారిపోయాడు. నిందితుడు కోసం పోలీసులు గాలింపులు ప్రారంభించారు.

# అన్నపురెడ్డిపల్లిలో అసంపూర్తి పనుల నిర్లక్ష్యం

**- డివైడర్‌లో ఇరుక్కున్న మూగజీవాలు**

**అన్నపురెడ్డిపల్లి, (భారత శక్తి):** భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లిలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులు అస్తవ్యస్తంగా, అసంపూర్తిగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరడంతో, తాజాగా సెంట్రల్ లైటింగ్ కోసం నిర్మించిన డివైడర్ కందకంలో ఒక గేదె ఇరుక్కుపోయి దయనీయ స్థితిలో ఉన్న దృశ్యం స్థానికులను కలచివేస్తోంది.?నిర్లక్ష్యానికి నిదర్శనం సెంట్రల్ లైటింగ్ కోసం తవ్విన గుంతను అలాగే వదిలేయడం వల్ల మూగజీవాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. పనులు సకాలంలో పూర్తి చేయకపోవడమే కాకుండా, కనీస భద్రతా చర్యలు కూడా చేపట్టకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.?ప్రజాధనం వృథా – అధికారుల బాధ్యతారాహిత్యం కి?సెంట్రల్ లైటింగ్ ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడం వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.? ఇలాంటి ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.?ప్రభుత్వ ప్రాజెక్టులు ప్రజల సౌకర్యం కోసం ఉండాలి కానీ, ఇలా మూగజీవాలకు మరణశాసనంగా మారడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.?వెంటనే అధికారులు స్పందించి, పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేయాలని, అలాగే ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని సన్మానించిన గౌడ గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్

కరీంనగర్ (**భారత శక్తి**)జిల్లా చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకమైన గౌడ బాంధవుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ గౌరవ్ల ఆడబిడ్డ రేణుక ఎల్లమ్మ తల్లి గౌడ నిత్యాన్నదాన సత్రం కొండగట్టు ఫౌండర్ అండ్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్, ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ కోల రాజేశం గౌడ్ లు శుక్రవారం బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను శాలువాతో సత్కరించి గౌడ నిత్యాన్నదాన సత్రం జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా మంద వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులు రాజకీయంగా ఎదగాలని అన్ని రంగాలలో ముందుండి గౌడ జాతిని అభివృద్ధి దిశగా తీసుకొని వెళ్ళాలని అన్నారు. రాజకీయ పార్టీలు ఏవైనా కానీ గౌడ కులస్తులు ఐక్యంగా ఉండి గౌడ కులస్తుల సమస్యలపై పోరాడాలని కోరారు.మా గౌడ నాయకుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామకం చేసిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యం అందుకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు కొండగట్టు గౌడ నిత్యాన్నదాన సత్రం అభివృద్ధి కమిటీ తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు..

# మోగిన బడి గంట

**హోళగుంద (భారత శక్తి):**మండల వ్యాప్తంగా శుక్రవారం బడి గంట మోగింది.ప్రధానంగా వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థి,విద్యార్థినీయులు బడి బాట పట్టారు.దీంతో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ముందుగానే ఉపాధ్యాయులు పాఠశాలలను పరిశుభ్రం చేయించారు.అలాగే ఇప్పటికే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఆయా పాఠశాలకు పాఠ్యపుస్తకాలు చేరినట్లు ఎంఈఓ – 1 సుధా రాణి,ఎంఈఓ – 2 కబీర్ సబ్ పాత్రికేయులకు తెలిపారు.

# మానసిక దివ్యాంగురాలిని ఇంటికి చేర్చిన సఖీ బృందం

**- సఖీ బృందానికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు**

**నరసరావుపేట (భారత శక్తి)**నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ నుండి మతి స్థిమితం లేని మహిళను పెల్లర్ నివత్తు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ- సఖి వన్ స్టాప్ సెంటర్ (ఓ ఎస్ సి) కు గురువారం తీసుకురాగా ఓఎస్‌సి ప్రతినిధులు ఆమె ను విచారించగా, తన ఊరు కోటప్పకొండ, యలమంద అని చెప్పడంతో ఆమెను సఖి బృందం అక్కడకి తీసుకొని వెళ్లగా, అక్కడ వారు ఆమె కాళికా మాత గుడి అనీ ఆమె చెప్పడం జరిగింది అని బృందం సభ్యులు తెలిపారు. అలా చెప్పగా బృందం సభ్యులు అక్కడికి వెళ్లిన తరవాత తను నేను వెళ్ళిపోతాను అనీ, మీరు నాతో రావొద్దు అని ఆమె కోరడం జరిగిందని వారు తెలిపారు. దీంతో ఓ ఎస్ సి సభ్యులు ఆమె వెనకనే వెళ్లగా, మతిస్థిమితం లేని ఆ మహిళ నేరుగా ఓ ఇంటిలో ప్రవేశించడం గమనించి అది ఆమె ఇల్లే అని నిర్ధారించుకొని ఇంట్లోకి వెళ్లడం జరిగింది అని (ఓ ఎస్ సి) సభ్యులు తెలిపారు. ఆమె తల్లిదండ్రులు చిన్నతనం లో చనిపోయారు. అనీ వాళ్ళ నాయనమ్మ వద్ద ఉంటుంది అనీ ఆమెకు అప్పగించడం జరిగినది బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఏ. రాజ్యలక్ష్మి, కేస్ వర్కర్ గరికపాటి. నవీన, నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ రైటర్ కదియాల రవికుమార్, సెంటర్ డ్రైవర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## కాశినాయన మండలంలో దేవాలయాల అభివృద్ధికి మంత్రి ఆనం హామీ

**పోరుమామిళ్ల((భారత శక్తి)** కాశినాయన మండలంలోని పలు గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని టీడీపీ నేతలు కోరారు. బద్వేల్‌కు విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని బద్వేల్ టీడీపీ ఇన్చార్జ్ రితీష్ రెడ్డి తో కలిసి బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బిజివేముల రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో కాశినాయన మండల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సానుకూలంగా స్పందించారు. కాశినాయన మండలంలోని ప్రతి గ్రామంలో దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాశినాయన మండల టీడీపీ నాయకులు పోలిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో కే6 రకం వేరుశనగ

**- ఏవో సురేష్ బాబు**

**తుగ్గలి: (భారత శక్తి)**మండల పరిధిలోని అన్ని రైతు సేవ కేంద్రాల యందు సబ్సిడీతో కూడిన కే6 రకం వేరుశనగ అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలియజేశారు.శుక్రవారం రోజున ఆయన మాట్లాడుతూ వేరుశనగ సాగు చేయాలన్న రైతులు తమ పరిధిలోని గల రైతు సేవ కేంద్రాల యందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలియజేశారు.ఒక క్వింటం వేరుశనగ ధర 10,200 కాగా,40 శాతం సబ్సిడీ 4080 రూపాయలు పోగా రైతు వాటా క్వింటంకి 6120 రూపాయలు చెల్లించవలసి ఉంటుందని ఆయన తెలియజేశారు. వేరుశనగ కావలసిన రైతులు పొలం పాస్ పుస్తకం,ఆధార్ కార్డు,ఆధార్ కార్డు లింక్ ఫోన్ నెంబర్లు తీసుకొని వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలియజేశారు.ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ నాచురల్ ఫార్మింగ్ ద్వారా మండల కేంద్రమైన తుగ్గలి నందు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ సీడ్ బాల్స్ ను తయారుచేసి వాటిని పొలం యందు వ్యవసాయ అధికారులు వెదజల్లారు. ఈ కార్యక్రమంలో డిహెచ్ఓ రాధాకృష్ణ రెడ్డి,ఆత్మ పిడి,ఎఈఓ లక్ష్మీనారాయణ, విపిఏ సూర్య తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో బి.ఎల్.ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలి: మల్‌రెడ్డి రాంరెడ్డి.

**- ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ శిక్షణ తరగతుల్లో పిలుపు**

**- అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం**

**- 6 లక్షల ఓటర్లలో 2 లక్షల మ్యాపింగ్ మాత్రమే పూర్తి: నేతల ఆందోళన**







ఎల్బీనగర్, జూన్ 12: భారత శక్తి, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో బూత్ స్థాయి ప్రతినిధులు అత్యంత బాధ్యతాయుతంగా, చురుగ్గా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ అధినేత మల్‌రెడ్డి రాంరెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) రాష్ట్ర పర్యవేక్షకురాలు మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాక్ హిల్స్ కాలనీలోని ఎస్‌వీఎల్ వేదికగా బూత్ స్థాయి ప్రతినిధుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

**- విస్తృత శిక్షణ.. ఓట్ల సవరణే లక్ష్యం**

ఈ శిక్షణ కార్యక్రమంలో టీపీసీసీ శిక్షకుడు కృష్ణ చైతన్య బూత్ స్థాయి ప్రతినిధులకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. నూతన ఓటర్ల నమోదు, జాబితా సవరణ, ఒకే పేరుతో ఉన్న నకిలీ ఓట్ల తొలగింపు తదితర సాంకేతిక అంశాలపై ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, సమాజంలోని వృద్ధులు, మహిళలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాల ప్రజలందరికీ ఓటు హక్కు దక్కేలా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో సహకరించాలని మల్‌రెడ్డి రాంరెడ్డి సూచించారు.

**- ఎల్బీనగర్‌లో పెండింగ్ మ్యాపింగ్ సవాల్**

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 577 బూత్‌లు ఉన్నాయని, సుమారు 6 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నప్పటికీ కేవలం 2 లక్షల ఓట్లు మాత్రమే మ్యాపింగ్ అయ్యాయని నేతలు ఈ సందర్భంగా వెల్లడించారు. మిగిలిన ఓటర్ల వివరాలను కూడా త్వరితగతిన నమోదు చేసి, సమగ్రంగా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**-రాజకీయ కుట్రలను తిప్పికొట్టాలి**

"కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్లను జాబితాల నుండి తొలగించేందుకు కుట్రలు చేస్తోంది. దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలన్నా, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మరింత బలోపేతం కావాలన్నా బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ నాయకులు పూర్తి సమన్వయంతో పనిచేయాలి."మల్‌రెడ్డి రాంరెడ్డి

**- తరలివచ్చిన ముఖ్య నాయకత్వం**

ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ అధినేత, ఎల్బీనగర్ కాంగ్రెస్ ఇంచార్జ్ మధు యాష్కీ గౌడ్, నియోజకవర్గ సమన్వయకర్త, తెలంగాణ సాంస్కృతిక సారథి అధినేత్రి డాక్టర్ వెన్నెల గద్దర్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, రాష్ట్ర యాదవ సహకార సంస్థ ఉపాధ్యక్షుడు గజ్జి భాస్కర్ యాదవ్, మాజీ నగర సేవకులు ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, రాగుల. వెంకటేశ్వర్ రెడ్డి, ముద్దగోని లక్ష్మీ ప్రసన్నతో పాటు నియోజకవర్గ ముఖ్య నేతలు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివాదంలో కదిరి షాదమహల్

**అనంతపురం(భారత శక్తి)** శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో నిరుపేద ముస్లింల కోసం దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రభుత్వ షాదీ మహల్‌కు ఎమ్మెల్యే తాళాలు వేయడం తీవ్ర దుమారం రేగుతోంది. 1994లోనే నాటి ఎమ్మెల్యే దివంగత జొన్నా సూర్యనారాయణ చొరవతో, లారీ యజమానుల అసోసియేషన్ స్థలంలో నిర్మించిన ఈ భవనం వేలాది మంది ముస్లిం కుటుంబాల శుభకార్యాలకు అండగా నిలిచింది. అయితే, గతంలో తాను కూడా ఈ భవన నిర్మాణానికి కొంత చందా ఇచ్చాననే సాకును చూపిస్తూ, ప్రస్తుత కూటమి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆ ప్రభుత్వ ఆస్తినే కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎమ్మెల్యే ఈ షాదీ మహల్‌కు తాళాలు వేసి తన అధీనంలో ఉంచుకున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ తాళాల వివాదం వెనుక కేవలం ఆస్తి తగాదా మాత్రమే లేదు.. దీని వెనుక ముస్లిం మైనారిటీలపై సాగుతున్న కక్షసాధింపు రాజకీయం స్పష్టంగా కనిపిస్తోందని వైసీపీ నేత ప్రణీత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. గత ఎన్నికల్లో తమకు ఓటు వేయలేదనే ఏకైక కోపంతోనే ప్రభుత్వ భవనానికి తాళాలు వేయించారని ప్రణీత్ రెడ్డి గట్టిగా వాదిస్తున్నారు. ఈ అనాలోచిత నిర్ణయం వల్ల గత రెండేళ్ల కాలంలో దాదాపు 500 మందికి పైగా నిరుపేద ముస్లిం కుటుంబాలు తక్కువ ఖర్చుతో పెళ్లిళ్లు చేసుకునే మహత్తర అవకాశాన్ని కోల్పోయి, తీవ్ర ఆర్థిక ఇబ్బందుల పాలయ్యారు. సమాజంలో గుడులు, మసీదులు, పాఠశాలల నిర్మాణానికి దాతలుగా చందాలు ఇవ్వడం ఆనవాయితీ అని, అంతమాత్రాన చందాలు ఇచ్చిన వారే ఆయా ప్రజా ఆస్తులకు యాజమాన్య హక్కులు క్లెయిమ్ చేయాలనుకోవడం చట్టవిరుద్ధమని ప్రణీత్ రెడ్డి మండిపడుతున్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఈ ప్రభుత్వ భవనాన్ని తిరిగి ఓపెన్ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. కదిరిలో రేగుతున్న ఈ కబ్జా పర్వం కేవలం షాదీ మహల్‌కే పరిమితం కాలేదు. నియోజకవర్గంలో విచ్చలవిడిగా సాగుతున్న ల్యాండ్ గ్రాబింగ్ సంస్కృతికి ఇది అద్దం పడుతోంది. పట్టణంలోని మసీదులు, గుడులు, చర్చిలు, చివరకు మైనారిటీల సమాధి స్థలాలను సైతం వదలకుండా ప్లాట్లుగా మార్చి అమ్ముకుంటున్నారని వైసీపీ నేతలు చేస్తున్నారు. అంతేకాకుండా, ఎమ్మెల్యే తన నివాసానికి సరిగ్గా ఎదురుగా ఉన్న, కోట్లాది రూపాయల విలువైన ప్రసిద్ధ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ స్థలాన్ని గత పదేళ్లుగా అక్రమంగా కబ్జా చేసి, తన సొంత అవసరాల కోసం ప్రైవేట్ పార్కింగ్ స్థలంగా వాడుకుంటున్నారనే ఉదంతాన్ని ప్రణీత్ రెడ్డి ఆధారాలతో సహా బయటపెట్టారు. దేవుడి భూములను వ్యక్తిగత స్వార్థానికి వాడుకోవడం మంచిది కాదని, నరసింహస్వామి ఆగ్రహానికి గురైన వారెవరూ రాజకీయంగా నిలబడలేరని హెచ్చరిస్తూ ఆ స్థలాన్ని వెంటనే దేవాదాయ శాఖకు అప్పగించాలని డిమాండ్ చేశారు. మరోవైపు, కదిరి నరసింహస్వామి ఆలయ పునరుద్ధరణ పేరుతో సాగుతున్న ప్రచారం వెనుక ఒక పెద్ద ఆర్థిక వ్యూహం దాగి ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రసాద్ స్కీమ్ ద్వారా కదిరి ఆలయాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా మారుస్తామని చెప్తూ, సూటు బూటు వేసుకుని తిరుగుతున్న ఎమ్మెల్యే అసలు ఉద్దేశం కదిరిని రక్షించడం కాదని, ఆ ప్రాజెక్టు వెనుక వందల కోట్ల ప్రసాద్ స్కామ్ చేయడమేనని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కేంద్ర నిధుల ముసుగులో సొంత వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకునేందుకే ఇలా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. రాజకీయ అధికారమంటే ప్రజల ఆస్తులను దోచుకోవడం, ప్రశ్నించిన విపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడం కాదని.. ఇటువంటి బెదిరింపులకు కదిరిలో ఎవరూ భయపడే ప్రసక్తే లేదని వైసీపీ ప్రణీత్ రెడ్డి స్పష్టం చేశారు. పేద ముస్లింల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన షాదీ మహల్‌ను తిరిగి స్వాధీనం చేసుకునే వరకు, అలాగే ఆలయ భూములను కబ్జాకోరుల నుంచి విముక్తి చేసే వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరంతరాయంగా క్షేత్రస్థాయి పోరాటాలు చేస్తాయని అంటున్నారు.

# పోలీసులకు రికవరీ...

కరీంనగర్,(**భారత శక్తి**) కరీంనగర్ జ్యోతినగర్‌లోని ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌పై జరిగిన భారీ దోపిడీ కేసు పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఘటన జరిగి దాదాపు 40 రోజులు అయినా చోరీ అయిన వజ్రాలు, బంగారు ఆభరణాల ఆచూకీ ఇప్పటికీ పూర్తిగా లభ్యం కాలేదు. సాధారణ దోపిడీ కేసుల్లో కొద్ది రోజుల్లోనే సొత్తు రికవరీ అయ్యేవి, కానీ ఈ కేసు పూర్తి వ్యతిరేక దిశలో సాగుతోంది.ఈ దోపిడీ కేసులో కీలక నిందితుడిగా పోలీసులు గ్యాంగ్‌స్టర్ సుబ్యోద్‌సింగ్ అని గుర్తించారు. ఇటీవలే అతడిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకొచ్చారు. అతనితోపాటు ఇతర నిందితులు కూడా విచారణలో పరస్పరం విరుద్ధమైన వాదనలు చెబుతున్నారు. ఒకరు ఒక విషయం చెప్పగా, మరొకరు దానికి పూర్తి వ్యతిరేకంగా సమాధానాలు ఇవ్వడం పోలీసులను తీవ్ర గందరగోళంలో పడేస్తోంది. ఈ విరుద్ధ సమాధానాలు సహజమైనవా లేదా నిందితులు కావాలని పోలీసులను తప్పుదారి పట్టించడానికి చేస్తున్న వ్యూహాత్మక ప్రయత్నమా అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. గ్యాంగ్‌స్టర్ నేతృత్వంలోని ఈ బృందం ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందుగానే సిద్ధమై ఉండవచ్చని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి.పీఎంజే కేసు దర్యాప్తు సాధారణ దొంగతనం కంటే చాలా క్లిష్టంగా మారింది. దోపిడీ జరిగిన వెంటనే సొత్తును వేర్వేరు చోట్లకు తరలించినట్లు పోలీసులు భావిస్తున్నారు. తర్వాత ఆభరణాలను కరిగించి వేరే రూపంలో మార్చడం లేదా ఇతర రాష్ట్రాలు, దేశాలకు పంపించడం జరిగి ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నిందితుల మధ్య ఉన్న విరుద్ధ వాదనలు నిజమైన సమాచారాన్ని బయట పెట్టడం లేదు. సైంటిఫిక్ ఫోరెన్సిక్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ లోతైన విశ్లేషణ, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్, సాంకేతిక పర్యవేక్షణ వంటి అధునాతన పద్ధతులు తప్పనిసరి అవుతున్నాయి.ఈ కేసు పోలీసులకు తలనొప్పిగా మారింది. సుబోధ్ సింగ్ ఇప్పటికే అనేక ఇతర కేసుల్లో ప్రమేయం ఉన్న గ్యాంగ్‌స్టర్ కావడంతో దోపిడీ వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఇప్పుడు కేవలం నిందితుల వాదనలపైనే ఆధారపడకుండా మరింత లోతైన విచారణ జరపాల్సి ఉంది. సొత్తు రికవరీలో ఆలస్యం జరిగితే నేరస్తులకు ధైర్యం పెరిగి, ఇలాంటి భారీ దోపిడీలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.పోలీసులు ఈ విరుద్ధ సమాచారాలను అధిగమించి, నిజమైన సొత్తు ఆచూకీని త్వరగా గుర్తించి రికవరీ చేయగలరా అనేదే ఈ కేసులో అత్యంత కీలకమైన అంశం. దర్యాప్తు ఎంత

# ఏపీ వ్యాప్తంగా వైసీపీ ఆందోళనలు

**- తాడిపత్రిలో పెద్దారెడ్డి అరెస్ట్**

**అనంతపురం (భారత శక్తి)**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హైలైట్‌గా నిలిచే ప్రాంతాల్లో తాడిపత్రి ఒకటి. నేడు అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ (జూఖీఅఖ) ఆధ్వర్యంలో చేపట్టిన 'వెన్నుపోటు' నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడంతో తాడిపత్రి పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు నిలిపివేశారు. ఈ నిరసనకు ఎలాంటి ముందస్తు అనుమతులు లేవని పోలీసులు స్పష్టం చేయడంతో, పోలీసులకు, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో పోలీసులు ఉద్రిక్తతల మధ్య పెద్దారెడ్డిని అదుపులోకి తీసుకుని అనంతపురానికి తరలించినట్లు తెలుస్తోంది. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికక్కడే రోడ్డుపై నిరసనకు దిగారు. ఈ క్రమంలో కొంతమంది కార్యకర్తలు పోలీసులపైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి మరింత చేయి దాటింది. దీంతో శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను పోలీసు వాహనంలో అనంతపురానికి తరలించారు. పెద్దారెడ్డి అరెస్ట్‌తో తాడిపత్రిలో రాజకీయ వేడి మరింత రాజుకుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణవ్యాప్తంగా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.మరోవైపు, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రిలో భారీ బైక్ ర్యాలీకి ఏర్పాట్లు జరిగాయి. ఒకే రోజు అటు అధికార కూటమి, ఇటు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ పోటాపోటీగా కార్యక్రమాలు చేపట్టడంతో శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు భావించారు. ఈ క్రమంలోనే అప్రమత్తమైన పోలీసులు వైఎస్సార్‌సీపీ నిరసనను అడ్డుకున్నారు.ఓవైపు తిరుపతి రూరల్ మండలం దామినేడు వద్ద కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభ భారీ ఎత్తున జరగనుంది. 20 ఎకరాల్లో జర్మన్ షెడ్లతో, 30 వేల మంది కూర్చునేలా విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ సభకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షులు మాధవ్, ఔఆం నేతలు పాల్గొని ప్రసంగించనున్నారు. రెండేళ్ల పాలనా ప్రగతిపై ప్రజలకు వివరించనున్నారు. మరోవైపు హామిలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపిస్తూ వైఎస్సార్ సీపీ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయా జిల్లాల్లో వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జ్ లు డీఎస్సీ పేరుతో కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపిస్తూ నిరసనల్లో పాల్గొంటున్నారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా, డీఎస్సీ పోస్టుల పేరుతో అక్రమాలకు పాల్పడిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. రెండేళ్లలో 3.5 లక్షల కోట్ల అప్పు చేసినా , కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయలేదని మాజీ మంత్రి కొడాలి నాని విమర్శించారు. జగన్ చేతిలో పరశురాముడి గొడ్డలి ఉందని, 2029 ఎన్నికల్లో కూటమి అవినీతిని నరకబోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# రైతులకు ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**నంద్యాల,(భారత శక్తి)** రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో ఉన్న బైసాని ట్రేడర్స్ ఎరువులు, యూరియా విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎరువుల పంపిణీకి వినియోగిస్తున్న ఏపీ ఎయిమ్స్ 2.0 ఆన్‌లైన్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రైతులకు ఎరువులు ఎలా పంపిణీ చేస్తున్నారనే అంశంపై వివరాలు తెలుసుకొని, అందుబాటులో ఉన్న యూరియా, డీఏపీ తదితర ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ రికార్డులను తనిఖీ చేశారు.

ముఖ్యంగా స్టాక్ నమోదు, పంపిణీ విధానం, రైతుల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ జరుగుతోందన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేయడానికి ఆధార్ కార్డుతో డీలర్ వద్దకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. డీలర్ లాగిన్ అయిన అనంతరం రైతు ఆధార్ నంబర్ నమోదు చేయగా, రైతు మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుందని, ఆ ఓటీపీ నమోదు చేసిన తర్వాత రైతుకు సంబంధించిన భూ విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటలు, అవసరమైన ఎరువుల వివరాలు స్క్రీన్‌పై ప్రదర్శితమవుతాయని వివరించారు.ప్రభుత్వం నిర్ణయించిన పరిమితి మేరకు రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులు అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎరువుల కోసం డీలర్ల వద్దకు వెళ్లే ముందు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రం (ఆర్‌ఎస్‌కే) ఇంచార్జ్‌ను సంప్రదించి, ఈ-క్రాప్‌లో నమోదైన పంట వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఒకవేళ పంట మార్పిడి జరిగి ఉంటే, సంబంధిత వివరాలను సవరించి నమోదు చేయించుకోవాలని తెలిపారు.అదేవిధంగా ఇతర మండలాలు లేదా ఇతర ప్రాంతాల్లోని డీలర్ల వద్ద ఎరువులు పొందాలనుకునే రైతులు ముందుగానే ఆర్‌ఎస్‌కే ఇంచార్జ్ ద్వారా సంబంధిత డీలర్ల పేర్లను తమ ఖాతాలో జోడించుకోవాలని సూచించారు. ఆర్‌ఎస్‌కే ఇంచార్జ్ ధృవీకరించి ఆమోదించిన పంట వివరాలు మాత్రమే డీలర్ లాగిన్‌లో కనిపిస్తాయని, వివరాలు ఆమోదం పొందని పక్షంలో రైతుల సమాచారం డీలర్‌కు అందుబాటులో ఉండదని పేర్కొన్నారు.

# ‘వీరభద్రుడు’ మూవీ రివ్యూ!

సూర్య కథానాయకుడిగా తమిళంలో నటించిన సినిమానే ‘కరుప్పు’. తెలుగులో ఈ సినిమాను ‘వీరభద్రుడు’ టైటిల్ తో విడుదల చేశారు. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 15వ తేదీన థియేటర్లకు వచ్చింది. 130 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, 300 కోట్లకి పైగా వసూలు చేయడం విశేషం. త్రిష .. ఆర్జే బాలాజీ ..శ్వాసిక కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఈ రోజు నుంచి తమిళంతో పాటు ఇతర భాషల్లోను ‘అమెజాన్ ప్రైమ్’లో స్ట్రీమింగ్ అవుతోంది. మునుస్వామి (ఇంద్రన్) తన కూతురు ‘మీను’ (అనఘ మాయ)ను వెంటబెట్టుకుని సిటీకి వస్తాడు. ఆమె లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఉంటుంది. లివర్ మార్పిడికి పెద్దమొత్తంలో డబ్బు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెబుతారు. అందువలన అతను తన దగ్గరున్న 60 సవర్ల బంగారాన్ని బ్యాంకులో పెట్టి డబ్బు తీసుకోవడం కోసం వస్తాడు. అయితే అతను ట్రైన్ దిగగానే దొంగలు ఆ నగలు కొట్టేసి పారిపోతారు. దాంతో తండ్రీ కూతుళ్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తారు. పోలీసులు 45 సవర్ల బంగారాన్ని మాత్రమే రికవరీ చేయగలుగుతారు. ఆ నగలను కోర్టు ద్వారా తీసుకోమని చెబుతారు. ఆ కేసును లాయర్ బేబీ కృష్ణ (ఆర్జే బాలాజీ) తీసుకుంటాడు. కేసును ఎటూ తేల్చకుండానే బేబీ కృష్ణ టీమ్ తమ టిఫిన్ బిల్లులను మునుస్వామితో కట్టిస్తుంటారు. అలా 4 నెలలు గడిచిపోతుంది. ‘మీను’ ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారుతుంది. అయినా తన బంగారం తన చేతికి రాకపోవడంతో మునుస్వామి విసిగిపోతాడు.కోర్టుకి సమీపంలో ఒక వీరభద్రస్వామి గుడి ఒకటి ఉంటుంది. స్వామికి మనసులో మాట చెప్పుకుంటే, తప్పకుండా నెరవేరుతుందని మునుస్వామి వింటాడు. తన కూతురును కాపాడమని వేడుకుంటాడు. దాంతో నేరుగా వీరభద్రుడు (సూర్య) రంగంలోకి దిగుతాడు. నేరుగా బేబీ కృష్ణకి కనిపించి, పద్ధతి మార్చుకోమని హెచ్చరిస్తాడు. దేవుడిలా అతీత శక్తులు చూపించకుండా, కోర్టుకు వచ్చి ‘మీను’కి న్యాయం చేసి చూడమని అతను వీరభద్రుడికి సవాల్ విసురుతాడు. అప్పుడు వీరభద్రుడు ఏం చేస్తాడు? అవినీతి పరులపై ఎలా విరుచుకుపడతాడు? అనేది కథ.సాధారణంగా ఎవరి చేతిలోనైనా మోసపోయినప్పుడు,మోసం చేసినవారికి తగిన గుణపాఠం చెప్పడానికి దేవుడు దిగివస్తే బాగుండునని చాలామంది అనుకుంటారు. మోసం చేసినవాళ్లు, తమని శిక్షించడానికి దేవుడు దిగివస్తాడా ఏంటి? అని నవ్వుకుంటారు. అయితే నిజంగానే దేవుడు దిగి వస్తే ఎలా ఉంటుందనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఆ దేవుడు కూడా ఒక మనిషి మాదిరిగానే ఎలా పరిస్థితులను చక్కదిద్దగలిగాడు? అనే కుతూహలాన్ని రేకెత్తిస్తూ మలుపులు తీసుకుంటుంది. ఈ కథ



అంతా కూడా కోర్టు .. లాయర్ల చుట్టూ తిరుగుతుంది. కోర్టుకు ఒక ప్రొసీజర్ ఉంటుంది .. దేవుడు దిగివచ్చినా దానిని మార్చలేడు. మహిమలు లేకుండా మనిషిగా వచ్చి కోర్టు పరిధిలో న్యాయం జరిగేలా చూడమని కథానాయకుడిని ప్రతినాయకుడు సవాల్ చేయడమే ఈ కథలోని కీలకమైన మలుపుగా చెప్పుకోవాలి. శిక్షించడానికి వచ్చిన దేవుడికి పరీక్ష పెట్టడం ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది.లాయర్ గా వీరభద్రుడు కోర్టుకు రావడం .. ‘మీను’ కేసును పరిష్కరించడం వరకూ బాగానే ఉంటుంది. ఆ తరువాత వీరభద్రుడి ప్రభావం కారణంగా, అసత్యాలు చెప్పాలనుకున్నవారు సైతం మాట తడబడిపోయి నిజాలు చెబుతూ ఉంటారు. దాంతో చకచకా కేసులు పరిష్కారమవుతూ ఉంటాయి. ఇక్కడే గ్రాఫ్ పడిపోయినట్టుగా అనిపిస్తుంది. ఎందుకంటే ఈ అంశానికి సంబంధించిన సన్నివేశాలు పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి.తండ్రీ కూతుళ్లు లాయర్ల ఉచ్చులో చిక్కుకోవడం ఎమోషనల్ గా బాగా కనెక్ట్ అవుతుంది. న్యాయమూర్తులు .. న్యాయవాదులు .. పోలీసులు .. రౌడీలు కుమ్మక్కయితే ఒక సామాన్యుడికి ఆ దేవుడే దిక్కు అనే పాయింట్ ను టచ్ చేస్తూ వెళ్లిన తీరు ఆకట్టుకుంటుంది. దేవుడైనా సరే దిగివస్తే, మనుషుల చేతిలో మోసపోవలసిందే అనే విషయాన్ని ఆవిష్కరించిన విధానం మెప్పిస్తుంది. కష్టాల్లో ఉన్న ఒక వ్యక్తి కన్నీరు దొంగలను కదిలించి వేస్తుంది గానీ, పోలీసులు .. లాయర్ల హృదయాలను కరిగించలేపోవడమనే సీన్ హైలైట్ గా నిలుస్తుంది.ఈ సినిమాలో ఆశ్చర్యకరమైన విషయం ఒకటుంది. అది ఏంటంటే హీరో సూర్య ఎంట్రీ, మొదటి అరగంట దాటిన తరువాతనే ఉంటుంది.ఇక మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే లాయర్ వీరభద్రుడుగా వచ్చింది సాక్షాత్తు దేవుడని తెలిసిన ఆ విషయాన్ని విలన్ ఈజీగా తీసుకోవడం. ఇక వీరభద్రుడు .. ప్రీతీ ద్వారా పరిష్కరించే రెండో కేసుకు సంబంధించిన సీన్ అంతగా ఇంపాక్ట్ చూపలేకపోయింది.

ఎలాంటి అండదండలు లేనివారు తమకి ఏదైనా కష్టం వచ్చినప్పుడు పోలీసులను .. న్యాయవాదులను ఆశ్రయించవలసి వచ్చినప్పుడు, వాళ్లకి ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయనేది దర్శకుడు చూపించిన విధానం ఆసక్తికరంగా అనిపిస్తుంది. విష్ణు ఫొటోగ్రఫీ .. సాయి అభ్యంకర్ నేపథ్య సంగీతం . కలైవానన్ ఎడిటింగ్ ఫరవాలేదు. వీరభద్రుడిగా సూర్య లుక్ .. వీరభద్రస్వామి నేపథ్యంలో వచ్చే సీన్స్ .. అందుకు సంబంధించిన గ్రాఫిక్స్ .. తండ్రీ కూతుళ్ల ఎమోషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. కొన్ని సీన్స్ వాస్తవానికి చాలా దగ్గరగా వెళితే, మరికొన్ని సన్నివేశాలు చాలా తేలికగా తేలిపోతూ ఉంటాయి. బలమైన కొన్ని సన్నివేశాలు మాత్రమే బాగున్నాయని అనిపిస్తుంది అంతే.

## అన్నీ కుదిరాయి... ‘ఓజీ2’ వస్తోందట!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు చిత్ర యూనిట్ తీపి కబురు అందించింది. ఆయన కథానాయకుడిగా నటించిన బ్లాక్ బస్టర్ హిట్ ‘దే కాల్ హిమ్ ఓజీ’ (ఓజీ) చిత్రానికి సీక్వెల్ రాబోతున్నట్లు అధికారికంగా ధ్రువీకరించారు. ఈ ప్రాజెక్టుపై దర్శకుడు సుజీత్ విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత చర్చలు ప్రారంభిస్తామని పవన్ కల్యాణ్ సొంత నిర్మాణ సంస్థ ‘పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్’ గురువారం వెల్లడించింది. “ఇచ్చిన మాట ప్రకారం ఆయన వస్తారు.. సమయం ఆయనే నిర్ణయిస్తారు. సుజీత్ విదేశాల నుంచి తిరిగి రాగానే చూ+2 గురించి చర్చిస్తాం” అని నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో, ఆయన సినిమాలకు విరామం ఇస్తారంటూ వస్తున్న ఊహాగానాలకు ఈ ప్రకటనతో తెరపడింది.2025 సెప్టెంబర్లో విడుదలైన ‘ఓజీ’ చిత్రంలో పవన్ కల్యాణ్ ‘ఓజస్ గంభీరా’ అనే గ్యాంగ్స్టర్ పాత్రలో ప్రేక్షకులను అలరించారు. సుజీత్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తొలుత మిశ్రమ స్పందనలు అందుకున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.300 కోట్ల వసూళ్లను రాబట్టి భారీ విజయాన్ని నమోదు చేసింది. తమన్ అందించిన నేపథ్య సంగీతం, హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.ప్రస్తుతం విదేశాల్లో ఉన్న దర్శకుడు సుజీత్, సీక్వెల్ స్క్రిప్ట్పై ఇప్పటికే కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం. ఆయన స్వదేశానికి చేరుకున్న తర్వాత ఈ ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో చర్చలు జరగనున్నాయి. అయితే షూటింగ్ ప్రారంభ తేదీ, ఇతర నటీనటుల వివరాలను చిత్ర యూనిట్ ఇంకా వెల్లడించలేదు. ఈ తాజా అప్డేట్తో పవన్ కల్యాణ్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.



## ప్రేక్షకుల ముందుకు సమంత...

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వయంగా నిర్మించిన చిత్రం ‘మా ఇంటి బంగారం’ విడుదలకు సిద్ధమైంది. తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం ‘ఖ/ూ’ సర్టిఫికెట్ను పొందింది. ఈ యాక్షన్ ఫ్యామిలీ డ్రామాను 2026, జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇటీవల విడుదలైన ట్రైలర్కు విశేష స్పందన లభించడంతో, చిత్ర యూనిట్ ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. బి.వి. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సమంత తన సొంత నిర్మాణ సంస్థ ‘ట్రలాలా మూవింగ్ పిక్చర్స్’ బ్యానర్పై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరులతో కలిసి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమాలో గుల్షన్ దేవయ్య, దిగంత్ మంచాలే, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందించగా, ఓం ప్రకాశ్ ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహించారు. సుమారు రెండు గంటల నిడివి కలిగిన ఈ చిత్రంలో సమంత సాహసోపేతమైన యాక్షన్ సన్నివేశాలను స్వయంగా చేసినట్లు తెలుస్తోంది.సంప్రదాయ కుటుంబానికి చెందిన ఓ నవవధువు గతాన్ని చుట్టుముట్టిన రహస్యాలు, వాటి వల్ల ఆమె కుటుంబానికి ఎదురయ్యే ముప్పును ఆమె ఎలా దీటుగా ఎదుర్కొందనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. వాస్తవానికి ఈ చిత్రాన్ని మే 15నే విడుదల చేయాలని భావించినప్పటికీ, ఐపీఎల్ 2026 సీజన్ దృష్ట్యా జూన్ 19కి వాయిదా వేశారు.కొంత విరామం తర్వాత సమంత ప్రధాన పాత్రలో వస్తున్న చిత్రం కావడంతో సినీ అభిమానుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం తమిళంలో ‘ఎంగల్ తంగం’ పేరుతో ఏకకాలంలో విడుదల కానుంది. ఇక జూన్ 18 నుంచే ఓవర్సీస్ ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.

## చిరంజీవి ‘మెగా158’ పొల్లాచ్చి షెడ్యూల్ పూర్తి


మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, యువ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం చవీవస్త్రు158. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా తమిళనాడులోని పొల్లాచ్చిలో చేపట్టిన కీలక షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది. ఈ విషయాన్ని దర్శకుడు బాబీ కొల్లి గురువారం తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఈ షెడ్యూల్లో కొన్ని అద్భుతమైన సన్నివేశాలను చిత్రీకరించినట్లు ఆయన తెలిపారు. “పొల్లాచ్చిలో చవీవస్త్రు158కు సంబంధించిన ఒక ఎలక్ట్రిఫైయింగ్ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది. కొన్ని అద్భుతమైన సన్నివేశాలు చాలా అందంగా రూపుదిద్దుకుంటున్నాయి. మరిన్ని ఉత్తేజకరమైన అప్డేట్లు రాబోతున్నాయి” అని బాబీ తన పోస్టులో పేర్కొన్నారు. గత వారమే ప్రారంభమైన ఈ షెడ్యూల్లో మెగాస్టార్ చిరంజీవితో పాటు ప్రధాన తారాగణం పాల్గొని కీలక సన్నివేశాల చిత్రీకరణలో పాల్గొన్నారు. ఈ సినిమా ద్వారా మలయాళ యువ నటి అనశ్వర రాజన్ తెలుగు తెరకు పరిచయం కాబోతున్నారు. ఇటీవల చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఆమెను ప్రాజెక్టులోకి స్వాగతిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. బ్లాక్బస్టర్ హిట్ ‘వాల్తేరు వీరయ్య’ తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్లో వస్తున్న రెండో సినిమా కావడంతో



చవీవస్త్రు158పై మెగా అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ‘జైలర్’, ‘డాకు మహరాజ్’ వంటి బ్లాక్బస్టర్ చిత్రాలతో గుర్తింపు పొందిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ కెమెరా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొల్లా అవినాష్ ఆర్ట్ డైరెక్టర్గా, ఆంటోనీ రూబెన్ ఎడిటర్గా పనిచేస్తున్నారు. గతేడాది చిరంజీవి పుట్టినరోజున ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ పాత్ర కోసం మెగాస్టార్ ఎంతగా శ్రమిస్తున్నారో తెలియజేస్తూ ఇటీవల జిమ్లో కసరత్తులు చేస్తున్న వీడియోను పంచుకున్నారు. ‘పరిమితులను అధిగమించడానికి ప్రతిరోజూ ఒక కొత్త అవకాశం. చవీవస్త్రు158 కోసం నా ప్రియమైన బాబీతో మరో చిరస్మరణీయ ప్రయాణానికి సిద్ధమవుతున్నాను’ అని ఆ వీడియోకు క్యాప్షన్ జోడించారు. సినిమా ప్రకటన పోస్టర్లో గొడ్డలితో పగిలిన గోడ, రక్తపు మరకలతో పాటు ‘ది బ్లేడ్ దట్ సెట్ ది బ్లడీ బెంచ్మార్క్’ అనే ట్యాగ్లైన్ ఉండటం సినిమా ఎంత పవర్ఫుల్గా ఉండబోతోందో సూచించింది. తదుపరి షెడ్యూల్, ఇతర నటీనటుల వివరాలపై త్వరలోనే స్పష్టత రానుంది.

## ‘అప్పలసూరి’కి రావాల్సిన గుర్తింపు రాలేదు..

## జగపతిబాబు ఆసక్తికర వ్యాఖ్యలు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ‘పెద్ది’ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ సినిమాలో రామ్ చరణ్ నటనతో పాటు పలువురు నటీనటుల పాత్రలు కూడా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సీనియర్ నటుడు జగపతిబాబు పోషించిన ‘అప్పలసూరి’ పాత్ర సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. గ్రామీణ నేపథ్యంలో సాగిన ఈ కథలో ఆయన పూర్తిగా పాత్రలో ఒదిగిపోయి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. సినిమా విజయానంతరం జగపతిబాబు, దర్శకుడు బుచ్చిబాబు సన కలిసి పాల్గొన్న ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ పాత్రకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో గుర్తింపు, నటనకు లభించే ప్రశంసలపై జగపతిబాబు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. అప్పలసూరి పాత్రకు థియేటర్లలో వస్తున్న స్పందన గురించి మాట్లాడుతూ జగపతిబాబు ఓ ఆసక్తికర సంఘటనను వెల్లడించారు. సినిమా విడుదలైన తర్వాత ఇండస్ట్రీకి చెందిన ఓ ప్రముఖ దర్శకుడు తనకు ఫోన్ చేసి మాట్లాడారని చెప్పారు. “ఈ పాత్రను ఏదైనా మలయాళం, తమిళం లేదా హిందీ నటుడు చేసి ఉంటే, అందరూ అతడిని ఆకాశానికి ఎత్తేసేవారు. కానీ మీరు తెలుగు నటుడు కావడం మీ బ్యాడ్ లక్. మనవాళ్లు మన ప్రతిభను అంతగా సెలబ్రేట్ చేయరు” అని ఆ దర్శకుడు తనతో అన్నట్లు జగపతిబాబు వెల్లడించారు. అలాగే, గతంలో ‘అరవింద సమేత’లో చేసిన వీరారెడ్డి పాత్ర తర్వాత నటుడిగా తనకు అత్యంత సంతృప్తిని ఇచ్చిన పాత్ర ‘అప్పలసూరి’దేనని ఆయన పేర్కొన్నారు. ఈ పాత్ర కోసం తాను ఎంతో కష్టపడ్డానని, ఫలితం కూడా అద్భుతంగా వచ్చిందని తెలిపారు.తెలుగు వార్తలు మరోవైపు దర్శకుడు బుచ్చిబాబు ఈ పాత్ర ఎంపిక వెనుక ఉన్న ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ‘పెద్ది’ సినిమాలో హీరో తర్వాత అత్యంత కీలకమైన పాత్ర అప్పలసూరిదేనని, ప్రేక్షకుల్లో ఆ పాత్రపై జాలి, అనుబంధం కలగాలని తాను కోరుకున్నానని చెప్పారు. అయితే జగపతిబాబు ఎప్పుడూ రాయల్ లుక్లో, స్టైలిష్ పాత్రల్లో కనిపిస్తారని, అందువల్ల గ్రామీణ వ్యక్తి పాత్రలో ఆయనను ప్రేక్షకులు అంగీకరిస్తారా లేదా అన్న సందేహం మొదట్లో తనకు వచ్చిందని బుచ్చిబాబు తెలిపారు. తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో స్టోరీ బోర్డు రూపొందించి పరిశీలించగా, ఈ పాత్రకు జగపతిబాబు కంటే సరైన ఎంపిక మరొకరు లేరని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అయితే ఈ పాత్రకు తాను ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదనే అసంతృప్తిని కూడా జగపతిబాబు వ్యక్తం చేయడం చర్చనీయాంశం అయింది

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం

## టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు



జగిత్యాల, జూన్ 12 (భారత శక్తి ప్రతినిధి): జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని, జిల్లాలోని సభ్యులందరికీ త్వరలో ఐడీ కార్డులు అందజేస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే 70 శాతం ఐడీ కార్డుల తయారీ పూర్తైందని, మిగిలిన సభ్యుల వివరాలు అందిన వెంటనే పంపిణీ చేస్తామని చెప్పారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అందేలా కృషి చేస్తామని, జిల్లాలో మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యూనియన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని, సంస్థ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగుల గోపాల్ చారి, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, అల్లే రాము, లోక రమణారెడ్డి, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, సహాయ కార్యదర్శులు గుర్రం చంద్రశేఖర్, కోరేపు రాజ్‌కుమార్, చింత నరేష్, కార్యవర్గ సభ్యులు మనోజ్, శంకర్ గౌడ్, రఘుపతి రెడ్డి, హరీష్, నరేష్, సాజిద్, జమీర్ అలీ, గౌస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభకు వేదికైన సమ్మర్ క్యాంప్

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ధర్మపురి సీఐ రాం నరసింహారెడ్డి







జగిత్యాల, జూన్ 12 (భారత శక్తి ప్రతినిధి): ఇషా ఇనిస్ట్యూషన్ ఆధ్వర్యంలో వేసవి సెలవులను పురస్కరించుకుని నిర్వహించిన కూచిపూడి నృత్య శిక్షణ శిబిరం శుక్రవారం ధర్మపురిలోని మాతృశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ముగిసింది. నెల రోజుల పాటు కొనసాగిన ఈ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులు కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందడంతో పాటు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. శిబిరం ముగింపు కార్యక్రమానికి ధర్మపురి సీఐ రాం నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ కళలను చిన్ననాటి నుంచే అభ్యసించడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం, మానసిక వికాసం పెంపొందుతాయని అన్నారు. ప్రస్తుతం పిల్లలు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు ఎక్కువ సమయం కేటాయిస్తున్న నేపథ్యంలో వారిని సృజనాత్మక కార్యకలాపాల వైపు మళ్లించడంలో ఇటువంటి శిక్షణా శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఇషా ఇన్‌స్టిట్యూషన్‌లో కంప్యూటర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లు, మెమెంటోలు ప్రదానం చేసి అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు కళలు, సాంకేతిక నైపుణ్యాలను కూడా అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నృత్య శిక్షకురాలు గుండి యమున, ఇషా ఇనిస్ట్యూషన్ నిర్వాహకులు పాకాల రాజేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుమామిళ్లలో జేసీ నిధి మీనా ప్రత్యక్ష వినతి స్వీకారం

## కార్యక్రమములో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ సూర్య నారాయణరెడ్డి




పోరుమామిళ్ల (భారతశక్తి ప్రతినిధి) జూన్ 12 :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా, పారదర్శకంగా మరియు సమర్థవంతమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో చేపట్టిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక - ఒక నియోజకవర్గం, ఒక నెల, నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల మండలంలో రెండవ పర్యటనను శుక్రవారం నిర్వహించారు. కడప జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా, ఐఏఎస్ ఆధ్వర్యంలో పోరుమామిళ్లలోని శ్రీ పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ప్రజల నుండి నేరుగా వినతులు స్వీకరించిన జాయింట్ కలెక్టర్, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా బద్వేల్ డివిజన్ ఆర్డీవో ఏ. చంద్రమోహన్, కడప జిల్లా డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. మొత్తం 301 మంది అర్జీదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# తాలిపేరు ఎడమ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలి.

## -ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి. జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 12 (భారతశక్తి): దుమ్ముగూడెం మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువతో పాటు దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాగునీటి సరఫరా, వైద్య సేవల నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మొదటగా వీరభద్రపురం గ్రామం పరిధిలోని తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువను పరిశీలించిన కలెక్టర్, కాలువ పరిస్థితులు, నీటి ప్రవాహం, ఆయకట్టు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాలిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24,700 ఎకరాల భూమికి సాగునీరు అందుతుండగా, ఎడమ కాలువ 46.46 కిలోమీటర్ల పొడవుతో 34 డిస్ట్రిబ్యూటరీల ద్వారా సుమారు 21,100 ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కాలువలో పెరిగిన గడ్డి, చెత్త, పూడికను వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సాగునీరు సకాలంలో అందేలా కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరేలా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అనంతరం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవల నిర్వహణపై సమగ్రంగా ఆరా తీశారు. ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు, సేవల నిర్వహణను పరిశీలించారు. ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చిన విద్యార్థులతో మాట్లాడి వారి వివరాలను తెలుసుకున్న కలెక్టర్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీకి అనుసరిస్తున్న విధానంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఔషధ నిల్వల గదిని పరిశీలించి మందుల నిల్వలు, అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. అలాగే ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ రిజిస్టర్లు, ఇతర వైద్య రికార్డులను పరిశీలించారు. పాముకాటు, తేలు కాటుకు గురైన రోగులకు అవసరమయ్యే అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాముకాటుకు గురైన వ్యక్తికి అందించే చికిత్స విధానం, అనుసరించే వైద్య ప్రోటోకాల్‌పై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు కాలువల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని, అలాగే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ అశోక్ కుమార్ ఇరిగేషన్ ఈఈ జానీ, డాక్టర్ రుక్మాకర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి

## - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.






నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 12 (భారత శక్తి) జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 1 లక్షా 58 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి, గోదాములకు తరలించినట్లు వివరించారు. 1 లక్షా 75 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులు, గోదాములకు తరలించినట్లు పేర్కొన్నారు. 30 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంట దిగుబడి రాగా, ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల జొన్న పంటను కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని మరో మూడు రోజుల్లో పూర్తిగా కొనుగోలు చేస్తామని తెలిపారు. పంట కొనుగోలుకు సంబంధించి, డబ్బులను ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయగలిగామని చెప్పారు. రానున్న పంట కాలానికి సంబంధించి రైతులకు ఎరువుల కొరత రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులెవరూ కూడా యూరియా లభ్యతపై ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, జిల్లాలో సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని అన్నారు. ప్రస్తుతం 10734 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

రైతులు వారి అవసరాన్ని బట్టి యూరియా బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలని చెప్పారు. ప్రతి ఎరువుల దుకాణం వద్ద ప్రత్యేకంగా ఒక పోస్టరును అందుబాటులో ఉంచుతామని, ఇందులో ఎరువుల ధరలు, తదితర వివరాలు ప్రదర్శించబడతాయని అన్నారు. రైతుల వద్ద ఎరువుల కోసం అధిక ధరలు వసూలు చేస్తే, 8977751754 నంబరును సంప్రదించవచ్చునని వివరించారు. ఎరువుల దుకాణదారులు, రైతుల వద్ద నుంచి అధిక డబ్బులు తీసుకోరాదని హెచ్చరించారు. అధిక డబ్బులు తీసుకునే దుకాణదారులపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఇప్పటికే అధిక ధరలకు ఎరువులను విక్రయించిన పలు దుకాణదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమవుతున్నందున, ప్రజలకు ఈ ప్రక్రియపై మీడియా మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, మార్క్ ఫెడ్ డీఎం మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, హార్టికల్చర్ అధికారి రమణ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన సిద్ధాంతాల కోసం నిరంతర సేవలు అందిస్తున్న శీలంశెట్టి లక్ష్మయ్యకు 50వ జన్మదిన శుభాకాంక్షలు



పోరుమామిళ్ల (భారతశక్తి ప్రతినిధి) జూన్12: వైఎస్సార్ కడప జిల్లా, బద్వేల్ నియోజకవర్గం, పోరుమామిళ్ల మండలం, పంచాయతీ 7వ వార్డుకు చెందిన శీలంశెట్టి లక్ష్మయ్య 1977 జూన్ 12న జన్మించారు(జూన్ 9వ తేదీ శీలంశెట్టి నందిని బర్త్డే,జూన్ 12వ తేదీ శీలం శక్తి నరేష్ బర్త్డే,జూన్ 12 శీలంశెట్టి లక్ష్మయ్య బర్త్డే జూన్ 20వ తేదీ శీలంశెట్టి లక్ష్మయ్య, సతీమణి విజయలక్ష్మి యొక్క మ్యారేజ్ డే, )రాజకీయ ప్రస్థానాన్ని కాంగ్రెస్ పార్టీతో ప్రారంభించిన ఆయన, అనంతరం జనసేన పార్టీ అధ్యక్షులు, పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చడంతో 2014లో జనసేన పార్టీలో చేరారు. చిన్నచిన్న పార్టీ కార్యక్రమాలతో ప్రారంభమైన ఆయన సేవా ప్రస్థానం, 2021 స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైనప్పటికీ మరింత బలంతో, పౌరుషంతో విస్తరించింది. ఆయన సతీమణి కూడా జనసేన వీరమహిళగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ లక్ష్మయ్యకు ఎల్లప్పుడూ అండగా నిలిచారు. 2023 లో పోరుమామిళ్ల పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని స్థాపించిన లక్ష్మయ్య, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అనేక పాదయాత్రలు నిర్వహించారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ సామాన్యుల గొంతుకగా నిలిచారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ అన్నదాన కార్యక్రమాలు, పేదలకు సహాయం, సామాజిక సేవా కార్యక్రమాలు, యువతకు ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టి ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నారు. 2024లో పోరుమామిళ్లలో జనసేన పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన ఆయన, పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ నాయకులు, కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చారు. గ్రామ గ్రామాన పార్టీ సిద్ధాంతాలను చాటుతూ జనసేన జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రజాసేవే పరమావధిగా, పార్టీ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న శీలంశెట్టి లక్ష్మయ్య గారు మరెన్నో విజయాలు సాధించి, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఆకాంక్షిస్తున్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలి

## - న్యాయ విజ్ఞాన సదస్సులో లీగల్ సర్వీస్ న్యాయవాది కాట్రోత్ రాజు నాయక్ పిలుపు




మెదక్ జిల్లా నర్సాపూర్, జూన్ 12:( భారత శక్తి న్యూస్): జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ,మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సాపూర్ మండలంలోని తుల్జారంపేట గ్రామ డ్వాక్రా సంఘంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లీగల్ సర్వీస్ న్యాయవాది జె.రాజు నాయక్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ సమాజానికి శాపంగా మారిందని, దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. చదువుకోవాల్సిన వయస్సులో ఉన్న బాలబాలికలను పనుల్లో పెట్టకుండా, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్ల సౌకర్యాలను వినియోగించుకుని వారికి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. చిన్నారులను ఉన్నత విద్యాభ్యాసం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరేలా తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు కృషి చేయాలని ఆయన అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో డ్వాక్రా మహిళలు కీలక పాత్ర పోషించాలని, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంపొందించి చిన్నారుల హక్కులను పరిరక్షించాలని కోరారు. అలాగే ఎవరైనా చట్టవిరుద్ధంగా చిన్నపిల్లలను పనిలో పెట్టుకున్నా లేదా వారితో పని చేయించినా సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సి. హెచ్. స్వరూప రాణి,న్యాయవాది జాట్రోత్రవి నాయక్, ఇంద్రకాంతి పథకం సీసీ ప్రమీల, లీగల్ సర్వీస్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ సర్కిల్ 13లో అక్రమ నిర్మాణాలను సీజ్ చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు

**- అక్రమ నిర్మాణాలపై ఏసీపీ అంబికా శ్రీ 'మార్క్'.. రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ బృందం!**

**- ఎల్బీనగర్ సర్కిల్ 13లో భారీగా సీజ్ చేసిన అధికారులు.. - నిబంధనలు ఉల్లంఘిస్తే ఊపేక్షించేది లేదు!**







ఎల్బీనగర్, జూన్ 12 (భారత శక్తి ): వచ్చి రాగానే అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ నయా బాస్ తన కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా నిర్మించే భవనాలపై ఉక్కుపాదం మోపారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోన్, సర్కిల్ 13 టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ACP) అంబికా శ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్బీనగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను అధికారులు సిబ్బందితో కలిసి నిలిపివేసి, సీజ్ చేశారు.

**- అనుమతి ఒకదానికి.. నిర్మాణం మరొకదానికి!**

ఎల్బీనగర్ సర్కిల్ 13 పరిధిలోని దుర్గా నగర్ కాలనీలో నివాస గృహాల (Residential) కోసం అనుమతులు తీసుకుని, కనీస ఫైర్ సేఫ్టీ నిబంధనలను తుంగలో తొక్కి కమర్షియల్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీనిపై తక్షణమే స్పందించిన ఏసీపీ అంబికా శ్రీ నేతృత్వంలోని బృందం సదరు భవనాన్ని పూర్తిగా సీజ్ చేసింది. అదేవిధంగా, నిర్మల కాలనీ మరియు మైత్రి పురంలోని పలు అక్రమ నిర్మాణాలను కూడా అధికారులు గుర్తించి, వాటిపై సీజింగ్ బోర్డులను తగిలించారు.

– "ఎల్బీనగర్ సర్కిల్ 13, సరూర్నగర్ సర్కిల్ 12, లలో నిబంధనలు అతిక్రమించి అక్రమంగా నిర్మించే ఏ ఒక్క కట్టడాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఫైర్ సేఫ్టీ నిబంధనలను అతిక్రమించినా ,అనుమతులు ఒకదానికి తీసుకుని, వ్యాపార ప్రయోజనాల కోసం వాడుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు."

**-అంబికా శ్రీ (టౌన్ ప్లానింగ్ ఏసీపీ)**


**- రంగంలోకి టౌన్ ప్లానింగ్ యంత్రాంగం**

ఈ ఆకస్మిక దాడులు మరియు సీజింగ్ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ అంబికా శ్రీతో పాటు టౌన్ ప్లానింగ్ జూనియర్ అసిస్టెంట్ పాండు నాయక్, చైన్ మెన్ రవీందర్ గౌడ్, రఘు మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు. నూతన అధికారిణి బాధ్యతలు చేపట్టగానే అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా తీసుకున్న ఈ నిర్ణయంపై స్థానికుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. భవిష్యత్తులో కూడా ఈ దాడులు ఇలాగే కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.



సున్నం వేసుకొని అసెస్మెంట్ తో సరూర్నగర్ సర్కిల్ 12 నిర్మాణం సంపూర్తి చేసుకొని ఓపెనింగ్ కి రెడీగా ముస్తాబయింది.












ఎం.ఎం.సీ సరూర్నగర్ సర్కిల్ 12, నిర్మాణ దశలో మూడు నెలల క్రితం అక్రమ నిర్మాణం ఫోటో..

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy